ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 28 మే 2025 | 3




ప్రమాదం జరిగిన రావిలంకలో అధికారులు


రావిలంకలో గోదావరి వద్ద గుమిగూడిన బాధిత కుటుంబీకులు, అధికారులు
కేతా ప్రవీణ్ సూర్యతేజ పాల్‌కుమార్

కన్నీటి గోదారై!

ఆరు కుటుంబాల్లో అంతులేని విషాదం


మృతిచెందిన యువకులు


మృతదేహాలను వెలికితీస్తున్న సిబ్బంది


మృతిచెందిన యువకులు


ఇక నాకు దిక్కెవరు : నితీష్‌కుమార్ తండ్రి రాజు రోదన

లే నాన్నా.. వెళ్లిపోదాం : నిర్జీవంగా పడి ఉన్న కొడుకును లేపుతున్న తల్లి

అమ్మా వెళ్లొస్తానన్నావు.. లే నాన్నా ఇంటికెళ్లిపోదాం.. నిర్జీవంగా పడి ఉన్న కొడుకును పట్టుకుని ఒక తల్లి పిలుస్తూనే ఉంది.. నాన్నా ఊరెళ్లొస్తానన్నావు.. ఎప్పుడొస్తావురా.. నీ కోసం నిన్న రాత్రి నుంచి చూస్తూనే ఉన్నా.. రారా వెళ్లిపోదాం! ఇదీ ఒక తండ్రి వేదన.. అన్నయ్యా.. ఇక నాకు దిక్కెవరు.. నువ్వు లేకుండా నేనుండలేను.. అమ్మా నాన్నా లేరు.. నేను నీ దగ్గరికే వచ్చేస్తా.. ఇదీ ఒక చెల్లి వేదన.. ఎటు చూసినా ఆర్తనాదాలే.. పిల్లల కోసం ఎదురుచూపులే.. క్షేమంగా బయట పడాలని మొక్కుబడులే.. ఇవేమీ ఫలించలేదు.. గల్లంతైన ఎనిమిది మందిలో ఏడు మృతదేహాలు లభ్యమయ్యాయి. తమ ఆశలు సమాధి చేసిన బిడ్డలను గుండెలకు హత్తుకుని.. దేవుడా ఇక మాకు దిక్కెవరు.. మేం ఎందుకు బతకాలంటూ రోదించారు.. వారిని ఆపడం ఎవరితరం కాలేదు.. ఒక్కసారిగా కన్నీరు.. గోదారైంది..!

- ఏడుగురి మృతదేహాలు లభ్యం
- కానరాని క్రాంతి మాన్యువల్ ఆచూకీ
- నేడు గాలింపు కొనసాగింపు
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు
- మాకు దిక్కెవరంటూ రోదనలు

(అమలాపురం/ముమ్మిడివరం -ఆంధ్రజ్యోతి)

నిన్నటి వరకూ తమ కళ్లెదుటే ఆడుతూ పాడుతూ తిరిగారు..ఆనందంగా వారి మధ్యనే గడిపారు.. అంతలోనే మృత్యువు ముంచుకొచ్చింది.. 8 మందిని ముంచేసింది.. గోదారమ్మ సాక్షిగా తరలిరాని లోకాలకు తీసుకెళ్లిపోయింది. ఏడు మృతదేహాలు సోమవారం లభ్యం కాగా గౌతమి గోదావరి తీరం మృతుఘోషతో మార్మోగింది. కుటుంబీకుల ఆర్తనాదాలతో దద్దరిల్లిపోయింది. బాధిత కుటుంబీకుల కన్నీళ్లు గోదావరి ప్రవాహంలా మారాయి. కె.గంగవరం మండలం శేరిలంకలో ఒక ఫంక్షన్‌కు 14 నుంచి 20 సంవత్సరాలు వయసు కలిగిన 11 మంది హాజరయ్యారు. భోజన విరామం అనంతరం సాయంత్రం వేళ ముమ్మిడివరం మండలం కమిని శివారు సలాదివారిపాలెం వద్ద ఉన్న గౌతమి నదిలో సరదాగా స్నానాలకు దిగారు. కాకినాడ, మండపేట, ఐ.పోలవరం ప్రాంతానికి చెందినవారు స్నానం కోసం నదిలో దిగి ఒక్కొక్కరిగా మొత్తం ఎనిమిది మంది కొట్టుకుపోయారు. ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై సోమవారం రాత్రి నుంచి 11 గంటల వరకు పడవలపై గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ లభ్యంకాలేదు. మంగళవారం ఉదయం నుంచే 35 మంది సభ్యులతో కూడిన ఎన్డీఆర్ఎఫ్ సభ్యుల బృందం, 10 మందితో కూడిన క్విక్ టీమ్, రెండు బృందాలు అగ్నిమాపకదళ సిబ్బంది, రెండు స్పీడ్‌బోట్లు, రెండు హైస్పీడ్‌బోట్లు, ఐదు ఇంజను బోట్లతో పాటు స్థానిక మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఐ.పోలవరం, కాట్రేనికోన ఎస్‌ఐలు ఎం.రవీంద్రబాబు, ఐ.అవినాష్, ముమ్మిడివరం తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి సమక్షంలో వైద్యులు నిఖిత, పృథ్వి, కౌశిక్, సాయిశృతి పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను ఒక్కొక్కటిగా బంధువులకు అప్పగించారు. మృతదేహాల గాలింపు సహాయక చర్యలను అధికారులు దగ్గరుండి పర్యవేక్షించారు. అమలాపురం, రామచంద్రపురం ఆర్డీవోలు కె.మాధవి, డి.అఖిల, రామచంద్రపురం, అమలాపురం డీఎస్పీలు బి.రఘువీర్, టీఎస్ఆర్కే ప్రసాద్, రామచంద్రపురం, ముమ్మిడివరం సీఐలు వెంకటనారాయణ, ఎం.మోహన్‌కుమార్, ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్, కె.గంగవరం ఎస్‌ఐ జానీబాషా సంఘటనా స్థలంలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి డ్రోన్ల సాయంతో గోదావరి తీరంలో మారుమూల సైతం శోధించారు. ఇలా సాయంత్రానికి ఏడు మృతదేహాలను వెలికితీసి ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయిన తరువాత బంధువులకు అప్పగించారు. ఇక కాకినాడకు చెందిన సబ్బతి క్రాంతిమాన్యువల్ (19) ఆచూకీ కోసం గాలింపు చర్యలు సాయంత్రం వరకు కొనసాగాయి. చీకటి పడడంతో మంగళవారం రాత్రి గౌతమీ నదిలో గాలింపు చర్యలను నిలిపివేశామని తిరిగి బుధవారం ఉదయం గాలింపు కొనసాగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. 5


తీరని వేదన : ముమ్మిడివరం ఆసుపత్రి వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబీకులు

ఏ మృతదేహం.. ఎక్కడ..

గోదావరిలో సోమవారం 8 మంది గల్లంతవ్వగా మంగళవారం ఉదయం 11గంటల వరకూ ఒక్క మృతదేహం లభ్యం కాలేదు.. రెస్క్యూ సిబ్బందికి ఏం చేయాలో పాలుపోలేదు. చివరకు స్పీడ్ బోటు తెచ్చి గోదావరిలో పోనివ్వడంతో ఒక్కొక్కటిగా ఏడు మృతదేహాలు బయటపడ్డాయి. ఐ.పోలవరం మండలం ఎర్రగరువుకు చెందిన వడ్డి మహేష్ (15) మృతదేహం సంఘటనా స్థలానికి 600 మీటర్ల దూరంలో పశువుల్లంక-సలాదివారిపాలెం వారధి సమీపంలో లభ్యమైంది. సబ్బతి పాల్‌అభిషేక్ (18) మృతదేహం గేదెల్లంక ఉత్తరవాహిని పుష్కరరేవు సమీపంలో లభించింది. ఎలిపే మహేష్ అలియాస్ బాబు (15) మృతదేహం గేదెల్లంకవైపు లభ్యమైంది. ఎలుమర్తి సాయిమహేష్ (20) మృతదేహం గేదెల్లంక ఉత్తరవాహినికి దగ్గరలో లభించింది. కులపాక మల్లేశ్వరవీరవెంకటరోహిత్ (19) మృతదేహం సంఘటనా స్థలానికి 500 మీటర్ల దూరంలో సలాదివారిపాలెం సమీపంలో లభ్యమైంది. తాతపూడి నితీష్‌కుమార్ (18) మృతదేహం సలాదివారిపాలెం వంతెన సమీపంలో లభ్యమైంది. వడ్డి రాజేష్ (13) మృతదేహం దగ్గరలోనే గేదెల్లంక వైపు లభ్యమైంది.

నాకు ధైర్యం నా కొడుకే.. ఇప్పుడేం చేయాలి..



నాకు ఇద్దరు అమ్మాయిలు. ఒక్కగానొక్క కుమారుడు. ఆటో జీవనాధారం. అమ్మాయిలిద్దరినీ ప్రభుత్వ పాఠశాలలో.. కుమారుడిని ప్రైవేటు కళాశాలలో చదివిస్తున్నా. ఎందుకంటే వాడే నాకు ఆధారం. బీఎస్సీ యానిమేషన్ కోర్సు చేస్తున్నాడు. త్వరలోనే యానిమేషన్ ఎడిటింగ్‌కు వెళ్లి లక్షల్లో సంపాదిస్తా.. చెల్లెళ్ల పెళ్లి చేస్తా.. అధైర్య పడొద్దని ధైర్యం చెప్పి అనంతలోకాలకు వెళ్లిపోయాడంటూ తండ్రి రాజు కన్నీటి పర్యంతమయ్యాడు. కొడుకు లేకుండా ఇంటికెళితే నా భార్యకు నేను ఏం సమాధానం చెప్పాలంటూ రాజు గుండెలు అవిసేలా విలపిస్తున్నాడు.

- మృతుడు తాతపూడి నితీష్‌కుమార్ తండ్రి రాజు, కాకినాడ

ఇక.. ఆ చెల్లికి దిక్కెవరు!



చిన్నతనంలోనే రోహిత్ తల్లిదండ్రులను కోల్పోయాడు. మేమే పెంచి పెద్ద చేస్తున్నాం. రోహిత్, అతని చెల్లి బిందుమాధవిని చదివిస్తున్నాం. ఇద్దరు ఒకరికొకరు తోడుగా ఉండేవారు.. చెల్లి బిందు మాధవికి ఎవరు దిక్కెవరంటూ పెంచి పెద్దచేసిన దంపతులు.. అన్నయ్య ఏడంటూ బిందుమాధవి రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

- మృతుడు రోహిత్ పెద్దమ్మ పెదనాన్న, మండపేట

అన్నదమ్ములిద్దరూ ఒకేసారి..



ముమ్మిడివరం/ఐ.పోలవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు కావడంతో ఐ.పోలవరం మండలం ఎర్రగరువు నుంచి అమ్మమ్మ కొండేపూడి బాలమ్మ ఊరైన శేరిలంకకు వెళ్లిన అన్నదమ్ములిద్దరినీ గోదారమ్మ మింగేసింది. భీమనపల్లి హాస్టల్‌లో ఉంటూ పది, ఎనిమిదో తరగతి చదువుతున్నారు. వీరి తల్లి భవానీ గల్ఫ్‌లో ఉండగా తండ్రి భైరవస్వామి జి.మూలపొలంలో ఉంటున్నాడు. బిడ్డలిద్దరూ గోదావరి పాలు కావడంతో కుటుంబం రోదిస్తున్న తీరు కంటతడి పెట్టించింది.తల్లి భవాని ఉపాధి నిమిత్తం కువైట్‌లో ఉండగా వీసా లభించకరావడం లేదని తెలిసింది. మృతదేహాలను ఎర్రగరువు తరలించారు.

- వడ్డి మహేష్, రాజేష్‌ల అమ్మమ్మ బాలమ్మ,తండ్రి భైరవస్వామి

పెద్దోడు డబ్బులడిగాడు.. అదే చివరి మాట..



బిడ్డలిద్దరినీ ఎంతో గారాబంగా పెంచాం. స్నేహితుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళుతున్నామని పెద్దోడు క్రాంతి మాన్యుయల్ అంటే ఫోన్‌పే చేశా. అదే చివరి మాట.. చిన్నోడు పాల్ అభిషేక్‌తో కనీసం మాట్లాడలేకపోయా. ఎంతో ఆనందంగా వేడుకకు వెళ్లి గోదావరిలో గల్లంతయ్యారు. నా బిడ్డలు లేకుండా నేను ఏ ముఖం పెట్టుకుని ఇంటికి వెళ్లగలను అంటూ తండ్రి రమేష్ బోరున విలపిస్తున్నాడు. చిన్నోడు అభిషేక్ మృతదేహం లభ్యంకాగా పెద్దోడు క్రాంతి ఆచూకీ లభ్యంకాక తండ్రి రమేష్ పడుతున్న వేదన అంతా ఇంతా కాదు.

- మృతుడు సబ్బిత పాల్ అభిషేక్ తండ్రి రఘుపలు, పాస్టర్, కాకినాడ

చేతికందకుండాపోయాడు..



నాకు ఇద్దరు కుమారులు.. చిన్నోడు సాయి మహేష్ ఒంగోలులో ఫిజియోథెరపీ చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటికి వచ్చాడు. స్నేహితులతో కలిసి శేరిలంకలో జరిగిన వేడుకకు వెళ్లాడు. ఇలా విగతజీవిగా మారాడని ప్రసాద్ దుఃఖంతో కుమిలిపోతున్నాడు. **- మృతుడు ఎలుమర్తి సాయిమహేష్ తండ్రి ప్రసాద్, కాకినాడ**

అమ్మ గల్ఫ్‌లో..తండ్రి పట్టించుకోడు..



ఉపాధి నిమిత్తం తల్లి వెంకటలక్ష్మి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుంది. తండ్రి రమేష్ కుటుంబాన్ని ఎప్పటి నుంచో పట్టించుకోవడం లేదు. మహేష్ కె.గంగవరం మండలం శేరిలంకలో అమ్మమ్మ కొండేపూడి మర్లమ్మ వద్ద ఉంటూ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. మిత్రులతో కలిసి సరదాగా వెళ్లిన మహేష్ అనంత లోకాలకు వెళ్లిపోవడం తట్టుకోలేకపోతున్నామని పెదనాన్న గెడ్డం నాగరాజు ప్రభుత్వాసుపత్రి వద్ద బోరున విలపిస్తున్నాడు.

- మృతుడు ఎలిపే మహేష్ పెదనాన్న గెడ్డం నాగరాజు

మరో విషాదం

- గోదారిలో ముగ్గురు బాలురు గల్లంతు
- అందరూ కోనసీమ జిల్లావాసులే
- ఆచంట మండలం రావిలంకలో ఘటన

పి.గన్నవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): ఆ కన్నీళ్లు ఇంకా ఆరనేలేదు.. మృతదేహాలు లభ్యంకాలేదు.. గోదావరిలో మరో విషాదం నెలకొంది.. మరో ముగ్గురు బాలురు గల్లంతవడంతో తీవ్ర విషాదం నెలకొంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంక దిగువన ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దు ప్రాంతం రావిలంకలో గత ఐదు రోజులుగా ఐదుగురు యువకులు స్నానాలు చేస్తున్నారు. యథావిధిగా మంగళవారం ఐదుగురు బాలురు స్నానానికి వెళ్లగా ముగ్గురు గల్లంతయ్యారు. మిగిలిన ఇద్దరు బయటపడ్డారు. నాగుల్లంక శివారు గౌతమ్ నగర్‌కాలనీకి చెందిన కేతా ప్రవీణ్(15), సానబోయిన సూర్యతేజ(12), పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం పెదలంక గ్రామానికి చెందిన నీతిపూడి పాల్‌కుమార్(15)లతోపాటు మరో ఇద్దరు బాలురు రావిలంకలో ఉన్న వశిష్ఠ నదీపాయలో స్నానానికి దిగారు. వారిలో ప్రవీణ్, సూర్యతేజ, పాల్‌కుమార్ గల్లంతు కాగా మిగిలిన ఇద్దరు భయంతో అక్కడ నుంచి వెళ్లిపోతూ దారిలో కొందరికి సమాచారం ఇచ్చారు.ప్రవీణ్ సెల్‌ఫోన్ ఆధారంగా తండ్రి వెంకటేశ్వరరావుకు స్థానికులు సమాచారం అందించారు. వెంకటేశ్వరావుతో పాటు సూర్యతేజ తండ్రి ఏడుకొండలు సంఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రవీణ్, పాల్‌కుమార్‌లు ఇటీవలే పదవతరగతి పాస్ కాగా సూర్యతేజ 8వ తరగతి చదువుతున్నాడు. పాల్‌కుమార్ తండ్రి మూడేళ్ల కిందట ప్రమాదంలో మృతిచెందగా తల్లి మహాలక్ష్మి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుంది. సోదరి దుర్గాభవాని ఉంది. పాల్‌కుమార్ నానమ్మ సత్యవతి సంరక్షణలో ఉంటున్నాడు. మూడు కుటుంబాలకు వీరంతా ఒక్కొక్కరే కాగా పాల్‌కుమార్‌కు సోదరి ఉంది. పాల్‌కుమార్ వేసవి సెలవుల నిమిత్తం నెల రోజులు కిందట సూర్యతేజ ఇంటికి వచ్చాడు. ఘటనా స్థలం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పరిధిలో ఉన్నప్పటికీ గల్లంతైన బాలురది కోనసీమ కావడంతో స్థానిక అధికారులు చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అక్కడకు చేరుకుని అధికారులతో మాట్లాడారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు.

కొడుకు, మేనల్లుడు గల్లంతయ్యారు..



సూర్యతేజ ఒక్కగానొక్క కొడుకు..పాల్ రాజ్ కుమార్ నా మేనల్లుడు.. ఈ ప్రమాదంలో ఇద్దరూ గల్లంతయ్యారు.ఇంట్లో తెలియ కుండా గోదావరి వద్దకు వచ్చేశారు. నా కుమారుడు ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్నాడు.

- సూర్యతేజ తండ్రి ఏడుకొండలు

నాకు ఒక్కడే కుమారుడు..



నాకు ప్రవీణ్ ఒక్కడే సంతానం. ఇటీవలే పదవ తరగతి పాసయ్యాడు. హైదరాబాద్‌లో ఉంటున్న నా సోదరుడి వద్దకు ఎలక్ట్రికల్ పని నిమిత్తం పంపుదామని అనుకుంటున్నా. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది.

- ప్రవీణ్ తండ్రి వెంకటేశ్వరరావు


ప్రమాదం జరిగిన రావిలంకలో పశ్చిమగోదావరి ఎస్పీ నయీంఅస్మీతోపాటు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

తెరుచుకున్న జ్ఞానభూమి పోర్టల్

- ఫీజు రీయింబర్స్‌మెంట్ వివరాలు నమోదు
- త్వరలో ఒక క్వార్టర్ ఫీజులు విడుదలయ్యే అవకాశం


బండారులంక సచివాలయంలో విద్యార్థి వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

అమలాపురం రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం విద్యార్థులు నెలల తరబడి ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయలేదు. దాంతో అప్పటికే విద్యా సంవత్సరం పూర్తిచేసుకున్న ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న సమయంలో ఎట్టకేలకు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలకు సంబంధించిన జ్ఞానభూమి పోర్టల్ తెరుచుకుంది. గత రెండు రోజులుగా సచివాలయ సిబ్బంది ఫోన్ల ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు సమాచారం అందిస్తుండడంతో ఆ కుటుంబాల్లో ఆనందానికి అవధుల్లేవు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపునకు సంబంధించి సచివాలయాల వారీగా జిల్లాలోని వేలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థుల సమాచారాన్ని ఇప్పటికే ప్రభుత్వం చేరవేసింది. దాంతో గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్న విద్యార్థుల జాబితాల ఆధారంగా వారికి సమాచారం అందించి విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి సచివాలయ సిబ్బంది నమోదు చేసుకుంటున్నారు. ఒక పోర్టల్‌కు సంబంధించిన బకాయిలు విడుదల చేసే అవకాశం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతోపాటు ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఇప్పటికే ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థుల సమాచారం అందడంతో వారంతా తల్లిదండ్రులతో కలిసి సచివాలయాలకు చేరుకుంటున్నారు. ఇంజనీరింగ్ కళాశాలల స్థాయిని బట్టి ఒక్కో విద్యార్థికి రూ.11వేలు నుంచి రూ.70 వేల వరకు ఫీజులు రీయింబర్స్‌మెంట్ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే విద్యార్థులు కళాశాలలకు పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించి ఉంటే సంబంధిత రశీదులు తీసుకువచ్చి వాటిని సచివాలయ సిబ్బంది ద్వారా జ్ఞానభూమి పోర్టల్‌లో నమోదు చేయించుకుని ఈకేవైసీ వేయాల్సి ఉంటుంది. దీంతో ఇంజనీరింగ్ విద్యార్థులు సచివాలయాల బాటపట్టారు.

31న సీఎం పర్యటన : కలెక్టర్

జిల్లాలో లాంఛనంగా పీ4 పథకం ప్రారంభం


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 31న ముమ్మిడివరం నియోజకవర్గంలో పర్యటించనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. సీఎం పర్యటనల బృంద సభ్యులు, జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన సమావేశమై పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఈ నెల 31న చెయ్యేరులో ఏర్పాటుచేసిన ప్రజావేదిక వద్ద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.9.88లక్షలతో చేపట్టిన చెరువు పూడికతీత పనులను పరిశీలించి స్థానికంగా ఉపాధి కూలీల్లో పెన్షన్ లబ్ధిదారులకు ఒకరోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ చేస్తారని తెలిపారు. అక్కడే ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతో రూపొందించిన పీ4పథకాన్ని కోనసీమ జిల్లాలో లాంచనంగా ప్రారంభిస్తారన్నారు. హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రిని స్థానిక ప్రజా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకుంటారన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డీఎల్డీవో రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయ సాధనకు కృషి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజలకు సుపరిపాలనను చేరువ చేసేందుకు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆశయ సాధనకు అధికార యంత్రాంగం పాటుపడాలన్నారు. అమరావతి నుంచి మంగళవారం వివిధ జిల్లాల కలెక్టర్లతో భూపరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి అనేక అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నదీ తీరం వెంబడి ఉన్న గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న రేవు పాయింట్ల వద్ద ప్రజా భద్రతకై బారికేడింగ్‌లు ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విచ్చలవిడిగా ఎవరూ నదిలోకి ప్రవేశించకుండా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్ అర్జీలను పూర్తి నాణ్యతతో నూరుశాతం పరిష్కరించాలన్నారు. రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహానాడులో మనవాళ్లు!



కడప మహానాడులో అమలాపురం పార్లమెంట్ రిజిస్ట్రేషన్ కేంద్రం


మహానాడులో చంద్రబాబుకు అభివాదం చేస్తున్న వారిలో మంత్రి సుభాష్


వేదికపై నేతలు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు చినరాజప్ప, గోరంట్ల


ఎమ్మెల్యే బుచ్చిబాబుతో సీఎం చంద్రబాబు మాటామంతీ..

గతేడాది టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా కడపలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడులో మంగళవారం మన జిల్లా నుంచి టీడీపీ శ్రేణులతో కలిసి పలువురు ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు హాజరై సందడి చేశారు.



మహానాడు సంబరం





కడప గడపలో టీడీపీ మహానాడు కార్యక్రమం తొలిరోజు సంబరంగా సాగింది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల నుంచీ వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో కడప గడప పసుపుమయంగా మారింది. ఉదయం ప్రతినిధుల సభకు సభ్యత్వ నమోదుతో మొదలైన కార్యక్రమం సాయంత్రం చంద్రబాబు ప్రసంగంతో ముగిసింది. వందలాది కార్యకర్తలు రక్తదానం చేశారు. లోకేశ్‌తో సెల్ఫీలు, షేక్‌హ్యాండ్ కోసం కార్యకర్తలు, అభిమానులు ఎగబడ్డారు. వేదికపై చంద్రబాబు, లోకేశ్ మాట్లాడుతున్నంతసేపూ జనం కేరింతలు కొట్టారు. 'ఈసారి కడప కూడా మాదే', యువగళం సక్సెస్ తదితర ప్లకార్డులను, ఫ్లెక్సీలను కార్యకర్తలు ప్రదర్శించారు. వేలాదిగా తరలివచ్చిన జనానికి మంచి విందు భోజనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహానాడు సంబరంగా సాగింది. రెండోరోజు మహానాడు కోసం అందరూ ఉత్సాహంగా ఎదురుచూస్తూ వారికి కేటాయించిన విడిది కేంద్రాల్లో బస చేశారు.



ప్రశాంతంగా ముగిసిన ఈఏపీసెట్

జేఎన్టీయూకే, మే 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్ కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో మంగళవారం ప్రశాంతంగా ముగిసిందని కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు తెలిపారు. రెండు సెషన్లలో మూడు జిల్లాల్లోని 9 కేంద్రాల్లో మొత్తం 2,068 మంది విద్యార్థులకు 1,993 మంది హాజరుకాగా 75 మంది గైర్హాజరయ్యారు.

కాకినాడ జిల్లాలోని ఐదు కేంద్రాల్లో మంగళవారం ఉదయం నిర్వహించిన ఇంజనీరింగ్ పరీక్షకు 901 మంది విద్యార్థులకు 866 మంది హాజరు కాగా 35 మంది గైర్హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు అన్ని సెషన్లకు కలిపి 3,683 మంది విద్యార్థులకు 3,431 మంది హాజరు కాగా 252 మంది గైర్హాజరయ్యారు. ఇంజనీరింగ్ విభాగంలో అన్ని సెషన్లకు కలిపి 8,987 మందికి 8,666 మంది హాజరు కాగా 321 మంది గైర్హాజయ్యారు.

తూర్పు గోదావరి జిల్లాలోని రెండు కేంద్రాల్లో మంగళవారం ఉదయం నిర్వహించిన ఇంజనీరింగ్ పరీక్షకు 762 మందికి 732 మంది హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు అన్ని సెషన్లకు కలిపి 2,585 మందికి 2,387 మంది హాజరు కాగా 198 మంది గైర్హాజరయ్యారు. ఇంజనీరింగ్ విభాగంలో అన్ని సెషన్లకు కలిపి 7,649 మందికి 7,416 మంది హాజరు కాగా 233 మంది గైర్హాజరయ్యారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రెండు కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన ఇంజనీరింగ్ పరీక్షకు 405 మందికి 395 మంది హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు అన్ని సెషన్లకు కలిపి 1,601 మందికి 1,510 మంది హాజరయ్యారు. ఇంజనీరింగ్ విభాగంలో అన్ని సెషన్లకు కలిపి 4,036 మందికి 3,891 మంది హాజరు కాగా 145 మంది గైర్హాజరయ్యారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రఫీ

'క్రికెట్ అసోసియేషన్‌పై రాజకీయాలు చేయడం సరికాదు'

కార్పొరేషన్ (కాకినాడ), మే 27 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ అసోసియేషన్‌పై రాజకీయాలు చేయడం సరికాదని ది ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, రంజీ మాజీ ప్లేయర్ రఫీ, సెక్రటరీ పి.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ అప్పారావు పేర్కొన్నారు. కాకినాడ ఆర్ఎంసీ మైదానంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 1998 నుంచి 2016 వరకు బాపిరాజు విజయకుమార్ తదితరులు అసోసియేషన్‌ను దీర్ఘకాలికంగా నిర్వహించి అనేక అవకతవకలకు పాల్పడ్డారన్నారు. అటువంటి వారు ప్రస్తుత అసోసియేషన్‌పై చేసిన అసత్య ఆరోపణలను ఖండించారు. గత అసోసియేషన్ సమయంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నుంచి వచ్చిన నిధులకు సంబంధించి ఆడిట్ నివేదిక లేదన్నారు. ప్రస్తుత రాష్ట్ర అసోసియేషన్ కార్యదర్శి, ఎంపీ సానా సతీష్ సహకారంతో అసోసియేషన్‌కు నిధులు వచ్చాయన్నారు. రెండున్నర సంవత్సరాలుగా ఎటువంటి నిధులూ రాక పోవడంతో అప్పులు చేసి అసోసియేషన్ నిర్వహించామన్నారు. అటువంటి తమ పై నిధులు కాజేశామంటూ ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. సానా సతీష్ సహకారంతో వచ్చిన నిధులతో గ్రౌండ్ అభివృద్ధితో పాటు కొత్త పిచ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. మీడియా సమావేశంలో అసోసియేషన్ ట్రెజరర్ మెట్ట వెంకటేష్, పలువురు ప్లేయర్లు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఒప్పంద అధ్యాపకులనుద్దేశించి మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రవీంద్రనాథ్

రెండో రోజుకు ఒప్పంద అధ్యాపకుల నిరసన

జేఎన్టీయూకే, మే 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో యూసీఈకే, వర్సిటీ ఒప్పంద అధ్యాపకులు తమను గతంలో మాదిరిగానే కొనసాగించాలని కోరుతూ చేపట్టిన నిరసన మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సమస్యపై రెక్టార్, రిజిస్ట్రార్, మాజీ వీసీ, ప్రిన్సిపాల్, ఇతర అధికారులు కాంట్రాక్ట్ అధ్యాపకులతో సమావేశం నిర్వహించి చర్చించినప్పటికీ పరిష్కారం కాలేదు. మంగళవారం రాత్రి 8 గంటలకు కూడా వర్సిటీ, కళాశాల అధికారులు సమస్యను పరిష్కరించకపోవడంతో నిరసన కొనసాగిస్తామని ఒప్పంద అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సీహెచ్ సుధీర్‌కుమార్ తెలిపారు. తమ నిరసనకు రాష్ట్ర ఒప్పంద అధ్యాపకుల సంఘం మద్దతు తెలిపిందన్నారు. రివ్యూ అని చెప్పి తమకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమన్నారు.

పురాతన రావి చెట్టు... మల్లేశ్వరం టు విదేశం


పురాతన రావి చెట్టును లారీలో తరలిస్తున్న దృశ్యం

పెరవలి, మే 27 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరంలో పురాతన వినాయకుడి గుడి పునర్నిర్మాణం చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆలయం పక్కన వందేళ్ల పైబడిన రావి చెట్టును తొలగించారు. దీనిని ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం విదేశానికి తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. ఈ చెట్టు పవిత్ర వాతావరణానికి ముఖ ద్వారంగా ఉండేది. చెట్ల వేర్లకు ఎటువంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ మూడు క్రేన్ల సహాయంతో చెట్టును లారీపై ఉంచి ప్రస్తుతం కడియపులంక తరలించారు. అక్కడ తాత్కాలికంగా పునర్వితరణ చేసిన అనంతరం విదేశాల్లో భారతీయులు నిర్వహిస్తున్న దేవాలయం వద్ద ప్రతిష్ఠించనున్నారు.

రైల్వే హ్యాండ్‌బాల్ పోటీల్లో గోల్డ్‌మెడల్స్


పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన భారతీయ రైల్వేస్ జట్టు

కొవ్వూరు, మే 27(ఆంధ్రజ్యోతి): రైల్వే 36వ ఫెడరేషన్ కప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో భారతీయ రైల్వేస్ పురుషులు, మహిళల జట్లు బంగారు పతకాలు సాధించినట్టు కోచ్ మద్దుకూరి సుధాకర్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన సుధాకర్ రాజమహేంద్రవరం రైల్వే సీనియర్ పాసింజర్ ట్రైన్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. భారతీయ రైల్వే పురుషులు, మహిళలు హ్యాండ్‌బాల్ టీంలకు కోచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రైల్వే 36వ ఫెడరేషన్ కప్ (పురుషులు, మహిళలు) హ్యాండ్‌బాల్ పోటీలు ఉత్తరప్రదేశ్‌లో ఈనెల 23నుంచి 26 వరకు జరిగాయి. ఈ పోటీల్లో 10 పురుషుల జట్లు, 8 మహిళల జట్లు, 3 డిపార్టుమెంటు జట్లు (రైల్వేస్, సర్వీసెస్, సీఐఎస్ఎఫ్) కలిపి 10 జట్లు పాల్గొన్నాయి. వీటిని 2 గ్రూపులుగా విభజించారు. భారతీయ రైల్వేస్ టీంని గ్రూప్ బిలో ఉంచారు. ఈగ్రూపులో మొత్తం 5 టీములు పాల్గొన్నాయి. భారతీయ రైల్వేస్ చండీగర్, చత్తీస్‌గడ్, పంజాబ్, సీఐఎస్ఎఫ్ టీములను ఓడించి సెమీ ఫైనల్‌లో ప్రవేశించి సర్వీసెస్ టీంపై 21-18 తేడాతో విజయం సాధించింది. ఫైనల్స్‌లో సీఐఎస్ఎఫ్‌తో తలపడి 26-17 తేడాతో విజయం సాధించి, బంగారు పతకం సాధించింది. రెండో స్థానంలో సీఐఎస్ఎఫ్, మూడో స్థానంలో సర్వీసెస్, ఉత్తరప్రదేశ్ జట్లు నిలిచాయి. మహిళల జట్టు బంగారు పతకం సాధించగా, ఉత్తరప్రదేశ్ రజిత, మూడో స్థానంలో పంజాబ్, గుజరాత్ జట్లు నిలిచినట్టు కోచ్ సుధాకర్ వివరించారు.

పోలేకుర్రులో ముగ్గురికి షోకాజ్ నోటీసులు

కలెక్టరేట్ (కాకినాడ), మే 27 (ఆంధ్రజ్యోతి): ట్రక్కు సీట్ లేకుండా మిల్లుకు ధాన్యం తరలిస్తున్న నేపథ్యంలో తాళ్లరేవు మండలం పోలేకుర్రులో రైతుసేవా కేంద్రంలో ముగ్గురికి షోకాజ్ నోటీసులు జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ దేవుల నాయక్ జారీ చేశారు. దీనిలో డేటా ఎంట్రీ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్, గ్రామీణ వ్యవసాయ సహాయకుడు ఉన్నారు.

పోస్టల్‌లో సొమ్ములు భద్రం

గోపాలపురం(నల్లజర్ల), మే 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోస్టల్ శాఖలో ఆర్థిక లావాదేవీలు జరపటం ద్వారా వినియోగదారుల సొమ్ముకు భద్రతా ఉంటుందని తాడేపల్లిగూడెం పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ అన్నారు. నల్లజర్లలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీలు, నగదు బదిలీ నిమిత్తం వినియోగదారులు తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలన్నారు. జూన్ 5లోపు ఆధార్ సీడింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు.


రాజమండ్రి సెంట్రల్ జైలులో రాష్ట్ర స్థాయి యోగా సాధన చేస్తున్న దృశ్యం, యోగాసనాలు వేస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

యోగాతో మానసిక ప్రశాంతత

- సంపూర్ణ ఆరోగ్యం: మంత్రి దుర్గేష్
- యోగా నిరంతర ప్రక్రియ:
- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రాష్ట్ర స్థాయి యోగా సాధన

రాజమహేంద్రవరం, మే 27(ఆంధ్రజ్యోతి): యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉపకరిస్తుందని, ప్రశాంత జీవనానికి బాట వేస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేయడమే యోగాంధ్ర ముఖ్య ఉద్దేశమని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. జీవ వైవిధ్య పురస్కారం పొందిన రాజమండ్రి సెంట్రల్ జైలులో మంగళవారం యోగాంధ్రలో భాగంగా రాష్ట్ర స్థాయి సాధన నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు యోగాసనాలు సాధన చేశారు. అనంతరం మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ యోగాను దైనందిన జీవనంలో భాగం చేసుకోవాలన్నారు. గతంలో గుజరాత్‌లో 1,23,000 మందితో యోగా సాధన చేసి రికార్డు నెలకొల్పారని, విశాఖలో 5లక్షల మందితో సాధన చేసి ఆ రికార్డును తిరగరాస్తామన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగా ప్రయోజనాలు పొందాలనే సత్సంకల్పంతో ప్రభుత్వం యోగాంధ్రకు శ్రీకారం చుట్టిందన్నారు. యోగా కులమతాలకు అతీతమైనదని, శరీరాన్ని, మనసును సమన్వయ పరచడం ద్వారా మంచి జీవనం అలవడేలా చేస్తుందన్నారు. ఐదు రోజులపాటు ప్రధాన శిక్షకులకు శిక్షణ ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఋషులు ప్రవచించిన విద్య యోగా అన్నారు. ఏనాటికైనా భారత్ విశ్వ గురు స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. గిన్నిస్ రికార్డు గ్రహీత కేఎల్‌వీ శ్రీధర్ రెడ్డి యోగాసనాలు వేయించారు. కారాగార పర్యవేక్షకులు ఎస్.రాహుల్ మాట్లాడుతూ ప్రిజన్స్ అనే ఇతివృత్తంతో చేపట్టిన ఈ యోగా సాధనలో మొత్తం 1500 మంది వివిధ ఆసనాలు వేశారన్నారు. జైలులోని ఖైదీల్లో మంచి పరివర్తన తీసుకొచ్చే కృషితోపాటు జీవవైవిధ్య రక్షణకు కృషి చేస్తున్నామన్నారు. జైలులో నిత్యం యోగా సాధన జరుగుతుందని, యోగా వల్ల ఉల్లాసమైన, ఆరోగ్యకర జీవనం అలవడుతుందన్నారు. తొలుతగా జైలులోని పరిశ్రమలు, వ్యవసాయ ఉత్పత్తులను మంత్రి, ఎమ్మెల్సీ, కలెక్టర్, జేసీ పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, జేసీ చిన్నరాముడు, అదనపు ఎస్పీ రమేశ్ బాబు, డీఆర్వో సీతారామ మూర్తి, జైలు అధికారులు రత్నరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడు పిలిచాడని...

● శుభకార్యానికి వెళ్లి విగతజీవులుగా మారిన కాకినాడ యువకులు..

● పాల్ మృతదేహం లభ్యం, క్రాంతి కోసం వెతుకులాట



ముమ్మిడివరంలో పోలీసుల వద్ద విలపిస్తున్న క్రాంతి, పాల్‌ల తల్లిదండ్రులు

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

వారందరూ 20 ఏళ్లలోపు యువకులే.. ఏదొక విభిన్న రంగంలో నిష్ణాతులే.. ఒకరు గిటారు ప్లేయర్ అయితే.. మరొకరు కీబోర్డ్ ప్లేయర్, మరొకరు సింగర్.. ఇలా తమ తమ టాలెంట్‌ను చూపేవారే.. క్రాంతి, పాల్ ఇద్దరూ అన్నదమ్ములు కాగా, వీరికి అభి, సాయి, నితీష్, మహేష్, రాజేష్, రోహిత్, కరుణకుమార్ వీళ్లందరూ క్రాంతి, పాల్‌ల తండ్రి సబ్బిత రఘు ఏలు కాకినాడ జగన్నాథపురం గోలీల పేటలో నిర్వహించే మెరిట్ మోరియా మినిస్ట్రీస్ చర్చికి వస్తుంటారు. క్రాంతి రిథమ్ ప్యాడ్ ప్లేయర్ కాగా, పాల్ మంచి గాయకుడు. క్రీస్తు కీర్తనల ఆలాపనలో దిట్ట. తల్లిదండ్రులకు పిల్లలంటే పంచ ప్రాణాలు. ఇక్కడకు వచ్చే పిల్లలను కూడా తమ పిల్లల్లాగే చూసుకునేవారు రఘు ఏలు. అం దరూ కలిసే భోజనం చేసేవారు. ఎక్కడికైనా సరదాగా వెళ్లేవారు. అలా ఈ యువకుల మధ్య స్నేహ బంధం బలపడింది. ఈ నేపథ్యంలోనే తమ చర్చిలో తమతో పాటు ఉండే అభి అనే యువకుడి చెల్లి శుభకార్యానికి క్రాంతి, పాల్, దాసరి కరుణకుమార్‌లు కారులో కాకినాడ జగన్నాథపురం గోలీలపేట నుంచి బయల్దేరారు. ఉదయం 10.30 గంటలకు కారులో బయల్దేరిన వీరు.. అక్కడికి క్షేమంగా చేరుకున్నారు. సరదాగా గడిపారు.. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. అందరితో మంచిగా ఉండే పాస్టర్ కుటుంబంలో ఇలా జరగడం దారుణం అంటూ స్థానికులు కన్నీటిపర్యంతమవుతున్నారు. మరోవైపు ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలు ఇలా విగతజీవులుగా మారడంపై ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారిని ఓదార్చడం ఎవరి వల్ల కావడం లేదు.

ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు

గోదావరి నదిలో ఎనిమిది యువకులు గల్లంతు కాగా మంగళవారం సాయంత్రం వరకు ఏడుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. కాకినాడకు చెందిన పాస్టర్ సబ్బతి రమేష్ ఇద్దరు కుమారులు గోదావరిలో గల్లంతు కాగా ఇప్పటికే చిన్న కుమారుడు పాల్‌అభిషేక్ మృతదేహం లభ్యమైంది. పెద్దకుమారుడైన క్రాంతిమాన్యువల్ ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. ఇప్పటి వరకు లభ్యమైన ఏడు మృతదేహాల్లో క్రాంతి మాన్యువల్ ఆచూకీ మాత్రం ఇంకా లభ్యం కాకపోవడంతో అతని కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో పాటు ఇతర సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు.

ప్రమాదానికి కారణాలివే..

ముమ్మిడివరం, మే 27 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో ఎనిమిది యువకులు గల్లంతు ప్రమాదానికి అవగాహనా లోపం కొంత. ఇసుక తీసిన గోతులు కొంత కారణం. గౌతమీ గోదావరి నదీ పాయలో ఇసుక కోసం అక్రమ తవ్వకాలు సాగించడంతో వాటిని గమనించకుండా స్నానానికి దిగినవారు ప్రవాహ వేగంలో మునిగి మృత్యువాత పడుతున్నారు. ముమ్మిడివరం మండలం గేదెల్లంక ఉత్తరవాహిని పుష్కరవాహిని వద్ద, సలాదివారిపాలెం వద్ద నదీ పాయలో ఇసుకను తీసి అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడి నీటిలో స్నానానికి దిగినవారికి అవి కనిపించక ప్రవాహ వేగానికి కొట్టుకుపోతున్నారు. గోదావరి పాటు సమయంలో ఇవి కనిపించినా పోటు సమయంలో నీరు ఎక్కువగా ఉండడంతో గోతులు కనిపించవు. సోమవారం కమిని సమీపంలోని సలాదివారిపాలెంలో జరిగిన ప్రమాదానికి కూడా ఇది కొంత కారణంగా చెప్పవచ్చును. దూర ప్రాంతం నుంచి వచ్చిన ఆ యువకులకు గోదావరి లోతు గానీ, ప్రవాహ వేగంగా అంచనా లేకపోవడంతో ఒకరి తరువాత ఒకరు స్నానానికి దిగి గల్లంతవుతూ వచ్చారు. ఆ ప్రాంతంపై అవగాహన ఉన్నా అక్కడ ఉన్న స్థానికులు ఆ ప్రాంతం గురించి ముందుగా చెప్పి ఉన్నా ఇంత ప్రమాదం, ప్రాణ నష్టం జరిగి ఉండేది కాదని పేర్కొంటున్నారు.



కోనసీమ జిల్లా సలాదివారిపాలెం వద్ద గోదావరి నది వద్ద మృతదేహాల కోసం చూస్తున్న కుటుంబసభ్యులు

గోదావరిలో గల్లంతైన నితీష్ మృతి



నితీష్ (ఫైల్‌ఫొటో)

గురజనాపల్లిలో విషాదఛాయలు



నితీష్ మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న తల్లి, కుటుంబసభ్యులు

కరప, మే 27 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లికి చెందిన తాతపూడి నితీష్ (18) ఇదే ఘటనలో మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తాతపూడి రాజు, వరలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు నితీష్ ఉన్నారు. రాజు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాకినాడలోని సంజీవ్ కళాశాలలో డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న నితీష్ చలాకీగా ఉండేవాడు. అందరితో కలుపుగోలుతనంగా ఉండే నితీష్ గిటా రిస్ట్‌గా ప్రావీణ్యం సాధించాడు. మంచి సృజనాత్మక ఆలోచనలు ఉన్న యువకుడే. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండడం, సామాజిక అంశాలపై వీడియోలు తీయ డం ఇతడికి అలవాటు. ఈ నేపథ్యంలోనే ఓ షార్ట్ ఫిలిం కూడా తీసినట్టు చెబుతున్నారు. నితీష్ మృతిచెందిన విషయాన్ని నమ్మలేని అతడి తల్లి వరలక్ష్మి ఇంట్లోనే ఉండిపోయి బోరున విలపించింది. పోస్టుమార్టం అనంతరం మంగళవారం సాయంత్రం మృతదేహం అంబులెన్స్‌లో గురజనాపల్లి చేరుకుంది. నితీష్ మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు, ఇద్దరు అక్కలు బోరున విలపించారు. వారి ఆక్రందనలను చూసి స్థానికులు కూడా కన్నీటిపర్యంతమయ్యారు.



నితీష్ ఇంటి వద్ద విషాదఛాయలు

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య



దొరబాబు మృతదేహం

కాకినాడ క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం కాకినాడలో జరిగింది. కాకినాడ వార్పు రోడ్డులోని ప్రేజర్‌పేట నాలుగో వీధికి చెందిన వనమాడి దొరబాబు (45) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి మరింత తీవ్రతరం కావడంతో తట్టుకోలేక మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య బయటి నుంచి వచ్చి చూసేసరికి భర్త ఫ్యాన్‌కు వేళాడుతూ విగతజీవిగా ఉండడం గమనించి హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే దొరబాబు మృతి చెందినట్టు అత్యవసర విభాగ వైద్యులు నిర్ధారించారు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య హేమలత, కుమారులు మోజెస్, శ్యామ్ సంతోష్ ఉన్నారు.

హోంగార్డ్‌పై సస్పెన్షన్ వేటు?

పెద్దాపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రాంబాబును పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్టు తెలిసింది. దీనికి సంబంధించి ఈనెల 23వ తేదీన కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ అయినట్టు సమాచారం. పట్టణంలో వ్యభిచార గృహాల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఉన్నతాధికారులకు పలు ఫిర్యాదులు అందడంతో హోంగార్డుపై విచారణ జరిపినట్టు తెలిసింది. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఇచ్చిన నివేదికల ఆధారంగా అతడిని సస్పెండ్ చేసినట్టు తెలియవచ్చింది. తనపై విచారణ జరుగుతున్నట్టు తెలుసుకున్న రాంబాబు సెలవు పెట్టి వెళ్లాడు. దీంతో రాంబాబును జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిచి సస్పెన్షన్ ఆర్డర్ అందజేసినట్టు తెలిసింది.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

తాళ్లరేవు, మే 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం నీలపల్లిలో పేకాట శిబిరంపై కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ బృందం మంగళవారం దాడి చేసింది. పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.3,010 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

500 కిలోల నల్లబెల్లం పట్టివేత

ప్రత్తిపాడు, మే 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం వేములపాలెం గ్రామంలో సారా తయారీకి రవాణా చేస్తున్న 500కిలోల నల్లబెల్లం, ఆటోను స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకుమార్ ఆదేశాల మేరకు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, ఎస్ఐ వంశీరామ్, సిబ్బంది వేములపాలెంలో ఆటోను సీజ్ చేసి 500కిలోల నల్లబెల్లాన్ని, గ్రామంలో 40లీటర్ల సారా కూడా స్వాధీన పరుచుకున్నారు. ఈ ఘటనలో పురోషోత్తం, రాజబాబు, తుట్ట అప్పలరాజు, గుడివాడ శ్రీనివాసరావు, బాదం సుబ్బారావులను అరెస్ట్ చేసినట్టు సీఐ శివప్రసాద్ తెలిపారు.



వేములపాలెంలో నల్లబెల్లంతో ఆటోను స్వాధీనం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పుట్టెడు దుఃఖంలో సైతం పరోపకారం

● యువకుడి బ్రెయిన్ డెడ్ ● అవయవ దానానికి అంగీకరించిన కుటుంబం



శివనారాయణ (ఫైల్‌ఫోటో)

సర్పవరం జంక్షన్, మే 27 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి కింద పడటంతో బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవాలను ముగ్గురికి దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముం దుకొచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి పల్లపు వీధికి చెందిన నున్న శివనారాయణ (27) తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 24వ తేదీ రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తూ మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలతో ఉన్న శివనారాయణను తొలుత స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనం తరం అక్కడి వైద్యుల సూచన మేరకు సోమవారం కాకినాడ సర్పవరం జంక్షన్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య శిరీష చేయూత సంస్థలో సభ్యురాలిగా ఉంది. బ్రెయిన్ డెడ్‌పై సమాచారం తెలుసుకున్న చేయూత సంస్థ అధ్యక్షుడు మొండి రవికుమార్ శివనారా యణ భార్య, తల్లి విజయలక్ష్మి, సోదరుడు వీరబాబులకు అవయవదానంపై అవగాహన కల్పించడంతో సమ్మతించారు. దాంతో పుట్టెడు దుఃఖంలో సైతం తమ బిడ్డ భౌతికంగా లేకపోయినా మరో ముగ్గురికి పునర్జన్మ ప్రసాదిస్తే తమకు అదే సంతోషమని భార్య శిరీష, తల్లి విజయలక్ష్మి తెలిపారు. మృతుడు రెండు కిడ్నీల్లో ఒకదానిని విశాఖలోని కిమ్స్ ఆసుపత్రికి గ్రీన్‌ఛానల్ ద్వారా మంగళవారం రాత్రి తరలించారు. మరో కిడ్నీ, లివర్‌ను స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. 2 నేత్రాలను బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకి అందజేశారు. వైజాగ్‌కి గ్రీన్‌ఛానల్ ద్వారా అవయవ తరలిం పునకు సహకరించిన కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, ఎస్‌డీపీవో, ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బందికి వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆనందంగా ఆడుకుని.. అంతలోనే కన్నుమూసి..

పాముకాటుకు ఐదేళ్ల బాలుడు మృతి

ర్యాలిలో ఘటన



మృతిచెందిన నాగసూర్య

ఆత్రేయపురం, మే 27(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల బాలుడిని పాము రూపంలో మృత్యువు కబళించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన జనిపిరెడ్డి శ్రీరాములు, నాగలక్ష్మి దంపతులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి సమీపంలో నివసిస్తున్నారు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ శ్రీరాములు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు జనిపిరెడ్డి మోహననాగసూర్య(5)ను కొద్ది నెలల క్రితమే ప్రైవేట్ స్కూల్‌లో చేర్పించారు. వేసవి సెలవులు కావడంతో పిల్లలతో సరదాగా గడుపుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో మంచం కిందకు వెళ్లి ఆడుకున్నాడు. కానీ ఎంతకీ బాలుడు బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు గమనించి చూశారు. కింద పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. బాలుడి కాలుపై పాము కాటు కనిపించింది. కుటుంబ సభ్యులు హుటాహుటినా కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి బాలుడు మృతిచెందినట్టు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

బీరు బాటిల్‌తో పీక కోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

అంబాజీపేట, మే 27(ఆంధ్రజ్యోతి): బీరు బాటిల్‌తో పీక కోసుకుని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోనసీమ జిల్లా అంబాజీపేట పరిధిలోని జయంతినగర్‌కు చెందిన ఈతకోట రవి స్థానిక బస్టాండ్ వెనుక ఉన్న చెట్టు వద్ద బీరుబాటిల్‌ను పగలుగొట్టు ఆ పెంకుతో పీక కోసుకున్నాడు. అక్కడి నుంచి రక్తస్రావంతో బస్టాండ్ వద్దకు వచ్చి స్పృహతప్పి పడిపోయాడు. స్థానికులు అతడ్ని 108లో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. రవి పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సిఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నవరంలో ఘనంగా ప్రత్యంగిర హోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు, పాల్గొన్న ఈవో దంపతులు

అన్నవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో మంగళవారం అమావాస్య పర్వదినం పురస్కరించుకుని ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించి ప్రత్యంగిరా దేవతను మంత్రపూర్వకంగా ఆవాహనగావించారు. జపములు, పారాయణలు నిర్వహించి 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు. ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

ఘనంగా నేరేళ్లమ్మ జాతర

అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో గ్రామదేవతగా పూజలందుకుంటున్న నేరేళ్లమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. పరిసరప్రాంతాల నుంచి మహిళా భక్తులు సారె, చీర నైవేద్యాలను సమర్పించారు. దేవస్థానం ఈవో వీర్లసుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

బుల్లెట్‌పై వచ్చి.. పోలీసులమని బెదిరించి..



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ జోన్ డీఎస్పీ విద్య

దారి దోపిడీ చేసిన ఇద్దరు

అరెస్ట్ చేసిన బొమ్మూరు పోలీసులు

రాజమహేంద్రవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): హైవేపై బుల్లెట్ వేసుకుని వస్తారు.. వాహనాలకు అడ్డంగా నిలిపి పోలీసులమని బెదిరిస్తారు.. సొమ్మును దోచుకుని ఉడాయిస్తారు... తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరు పోలీసులు ప్రత్యేక నిఘాతో ఈ దొంగ పోలీసుల ఆట కట్టించారు. ఈ మేరకు ఈస్ట్ జోన్ డీఎస్పీ విద్య వివరాలను వెల్లడించారు. ఈనెల 25న అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు హైవే సమీపంలో బుల్లెట్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి తన బొలెరో వాహనాన్ని అటకాయించారని, తాము పోలీసులమంటూ కత్తితో బెదిరించి రూ.వెయ్యి దోచుకుపోయారని విజయనగరం జిల్లా పెదమానాపురానికి చెందిన కూరాడ శివరాజు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి డీఎస్పీ స్వీయ పర్యవేక్షణలో సీఐ కాశీవిశ్వనాథం ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా రాజవోలు ఏఎంజీ స్కూల్ ప్రాంతానికి చెందిన సిర్ర జాస్పర్ ప్రిన్స్, మామిడికుదురు మండలం ఆదూరుకు చెందిన గుడిసె రాబిన్‌లను నిందితులుగా గుర్తించి పాలచర్ల రోడ్డులో మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ వివరించారు. బుల్లెట్, ఫోల్డింగ్ బటన్ చాకు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీళ్లపై గతంలో కూడా దారి దోపిడీ, గంజాయి కేసులు వివిధ పోలీస్ స్టేషన్లలో ఉన్నాయని ఆమె తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన సీఐ కాశీ విశ్వనాథం, ఎస్ఐ మురళీ మోహన్ తదితరులను ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ విద్య అభినందించారు.

శుభకార్యానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

కాపవరంలో 8 కాసుల బంగారం, 50 తులాల వెండి చోరీ



బీరువా తెరిచి చిందరవందరగా పడేసిన దృశ్యం

కొవ్వూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు దోచేసిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో జరిగింది. కాపవరానికి చెందిన దువ్వాపు రామారావు ఈ నెల 26న ఉదయం 10గంటలకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో శుభకార్యానికి వెళ్లి సాయంత్రం 4 గంటలకు తిరిగివచ్చాడు. ఇంటి వెనుకవైపు తలుపులు తెరచి ఉంటే లోపలికి వెళ్లి చూశాడు. బీరువా తలుపులు తెరచి దుస్తులు, సామాన్లు చిందరవందరగా పడవేసి ఉండడంతో దొంగతనం జరిగిందని గమనించి కొవ్వూరు రూరల్ పోలీసులకు సమాచారం అందించాడు. సుమారు 8 కాసుల బంగారు వస్తువులు, 50 తులాల వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయని ఫిర్యాదు చేశాడు. వెంటనే ఎస్ఐ శ్రీహరిరావు సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని క్లూస్‌టీంను రప్పించి దర్యాప్తు ప్రారంభించారు. రామారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

తినుబండారాల నాణ్యత, ధరలపై అధికారుల ఆరా

థియేటర్లలో పారిశుధ్య నిర్వహణ పరిశీలన



కాకినాడ సీఅండ్‌సీ థియేటర్‌లో అర్బన్ తహశీల్దార్, అధికారుల బృందం తనిఖీ

కాకినాడ, మే 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఉమ్మడి జిల్లాలోని సినిమా థియేటర్లలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాకినాడతోపాటు కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోను సినిమా థియేటర్ల నిర్వహణ, వాటిలో సౌకర్యాలపై ఆయా జిల్లాల అధికారులు మంగళవారం రాత్రి ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అన్ని మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, అగ్నిమాపక, ఫుడ్ సేఫ్టీ, పోలీసులు, తూనికలు కొలతలశాఖ అధికారులతో కూడిన బృందం ఈ తనిఖీలు నిర్వహించింది. జిల్లాలో సినిమా థియేటర్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని, థియేటర్లలో ఆహార నాణ్యత, ధరల నియంత్రణ, టికెట్ ధరలు, తినుబండారాల విక్రయం, థియేటర్ ఫిట్‌నెస్, ఫైర్, ఫుడ్ సేఫ్టీ, శానిటేషన్ తదితర అంశాలను పరిశీలించారు. వివరాలను నమోదు చేసుకున్నారు. కాకినాడలో కాకినాడ అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర కాకినాడలోని సీఅండ్‌సీ(చాణుక్య, చంద్రగుప్త) థియేటర్‌ను, కాకినాడ రూరల్, తాళ్లరేవు తహశీల్దార్లు కుమారి, పితాని త్రినాథరావులు దేవీ మల్టీప్లెక్స్ థియేటర్లను తనిఖీ చేశారు. పెదపూడి తహశీల్దార్ పీవీ సీతాపతిరావు, కాకినాడ నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి పృథ్వీచరణ్, తదితరుల బృందం ఆనంద్, గీత్, సంగీత్ థియేటర్లను తనిఖీ చేసింది. నిబంధనల ప్రకారం థియేటర్లను నిర్వహిస్తున్నారా? అన్ని లైసెన్సులు ఉన్నాయా? లేవా? వాష్ రూమ్స్ నిర్వహణ, తినుబండారాల అమ్మకాలు, హాలులో సిట్టింగ్ సౌకర్యవంతంగా ఉందా? ఇలా అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. పలు థియేటర్లలో లోపాలను గుర్తించారు. కాకినాడలోని ఆనంద్, అంజనీ, గీత్, సంగీత్, తిరుమల థియేటర్లను తనిఖీ బృందాలు పరిశీలించాయి. జిల్లాలోని తునిలో శ్రీరామ్, పిఠాపురంలో వెంకటేశ్వర, శ్రీసత్య, ఏలేశ్వరం జయశ్రీ, పెద్దాపురం వీరభద్ర థియేటర్లలోను అధికారుల బృందం తనిఖీలు చేసింది. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు.



కాకినాడ ఆనంద్ సినిమాస్‌లో తనిఖీ చేస్తున్న పెదపూడి ఎమ్మార్వో, నగరపాలక సంస్థ ఎంహెచ్‌వో

ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు పొడిగింపు

సామర్లకోట, మే 27 (ఆంధ్ర జ్యోతి): విజయవాడ- విశాఖల వైపునకు సామర్లకోట మీదుగా వేసవి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈనెల 25 వరకూ నడుస్తున్న ఆరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను జూన్ 1 నుంచి 27 జూలై వరకూ పొడిగిస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌కు అందిన ఉత్తర్వులను ఆంధ్రజ్యోతి సేకరించింది. 08581 నంబరు గల విశాఖ పట్నం- ఎస్ఎంవీటీ బెంగుళూరుల మధ్య వేసవి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు 1 జూన్ నుంచి 27 జూలై వరకూ ప్రతీ ఆదివారాలలో 9 ట్రిప్‌లు నడువనున్నట్లు తెలిపారు. ఈ రైలు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు రాత్రి 7.01కి, రాజమహేంద్రవరానికి 7.53కు చేరుతుంది.

08582 నంబరు గల ఎస్ఎంవీటీ బెంగుళూరు-విశాఖపట్నంల మధ్య వేసవి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు 2 జూన్ నుంచి 28 జూలై వరకూ ప్రతీ సోమవారాల్లో 9 ట్రిప్‌లు నడువనున్నట్లు తెలిపారు. ఈ రైలు రాజమహేంద్రవరానికి ఉదయం 9.06కు చేరుతుంది. సామర్లకోటకు 10.01కు చేరుతుంది. 08547 నంబరు గల విశాఖపట్నం- తిరుపతిల మధ్య వేసవి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు 4 జూన్ నుంచి 30జూలై వరకూ ప్రతీ బుధవారం 9 ట్రిప్‌లు నడువనుంది. సామర్లకోటకు రాత్రి 9.08కు, రాజమహేంద్రవరానికి 9.53కు చేరుతుంది.

08548 నంబరు గల తిరుపతి- విశాఖపట్నంల మధ్య వేసవి ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు 5 జూన్ నుంచి 31 జూలై వరకూ ప్రతీ గురువారం 9 ట్రిప్‌లు నడువనుంది. ఈ రైలు రాజమహేంద్రవరానికి ఉదయం 6.43కు, సామర్లకోటకు 7.28కు చేరుతుంది. 08579 నంబరు గల విశాఖపట్నం- చర్లపల్లిల మధ్య వేసవి ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు 6 జూన్ నుంచి 25 జూలై వరకూ ప్రతీ శుక్రవారం 8 ట్రిప్‌లు నడువనుంది. 08580 నంబరు గల చర్లపల్లి- విశాఖపట్నంల మధ్య వేసవి ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు 7 జూన్ నుంచి 26 జూలై వరకూ ప్రతీ శనివారం 8 ట్రిప్‌లు నడువనుంది. రాజమహేంద్రవరానికి తెల్లవారుజామున 5.50కు, సామర్లకోటకు 7.07కు, అన్నవరానికి 7.38కు చేరుతుంది.

జవహర్‌లాల్‌నెహ్రూ వర్ధంతి

అమలాపురం టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురంలోని నెహ్రూవీధిలో నిర్వహించారు. నెహ్రూ విగ్రహానికి పట్టణశాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ముమ్మిడివరం, మే 27(ఆంధ్రజ్యోతి): గాడిలంక గ్రామ సమీపంలో ఎన్డీపీఎల్ మద్యం తరలిస్తున్న ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన యాళ్ల సత్యనారాయణను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచినట్టు ఎక్సైజ్ సీఐ కె.రవితేజ, ఎస్ఐ కె.తమ్మారావు తెలిపారు. 79 మద్యం సీసాలను, మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

● ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం



నగర పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం, మే 27(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సమీపిస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ కార్యక్రమాలకు చర్యలు చేపట్టాలని ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ సూచించారు. ముమ్మిడివరం నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశం మంగళవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. తొలుత తొమ్మిది అంశాలతో కూడిన అజెండాను, ఐదు అంశాలతో కూడిన టేబుల్ అజెండాను ప్రవేశపెట్టి పలు అంశాలపై చర్చించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని దోమలు, అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని వార్డుల్లో యుద్ధ ప్రాతిపదికన శానిటేషన్ చర్యలు చేపట్టాలని ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషనర్ పి.రవివర్మ స్పందించి సమస్యపై లిఖిత పూర్వకంగా ఇవ్వాలని కోరారు. కమిషనర్ తీరు సమంజసంగా లేదని, సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువస్తే లెటర్ ఇవ్వమని కోరడం సభ్యులను అవమానించడమేనని, కమిషనర్ తీరును మార్చుకోవాలని బాలకృష్ణ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్ కల్పించుకుని సభ్యులు తీసుకువచ్చిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు సూచించారు. జాతీయ రహదారి వెంబడి అనధికారికంగా వెంచర్లు వేస్తున్నారని, పంట బోదెలపై తూరలు వేయకుండా వెంచర్లు వేసేవారు కప్పేస్తున్నారని, దీనిపై ఏం చర్య తీసుకున్నారో కమిషనర్ చెప్పాలని బాలకృష్ణ పట్టుబట్టారు. వెంచర్లదారులంతా కన్వర్షన్ ట్యాక్సు కట్టారని సమాధానమిచ్చారు. దీనిపై నోటీసులు ఇచ్చారా అని బాలకృష్ణ ప్రశ్నించారు. ఎట్టిపరిస్థితుల్లో అనధికారిక వెంచర్లు, ఏవిధమైన నిర్మాణాలు చేపట్టకుండా పట్టణ ప్రణాళికాధికారుల పర్యవేక్షణ ఉండేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. డంపింగ్ యార్డులో చెత్తను తీసుకువెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు నిర్మించి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని బాలకృష్ణ ఆరోపించారు. తక్షణమే చెత్తను రోడ్డు పక్కన కాకుండా డంపింగ్ యార్డులోకి తీసుకువెళ్లే విధంగా రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. వార్డుల్లో సేకరించిన చెత్తను తీసుకువెళ్లే ట్రాక్టరు ఒకటే ఉందని, చెత్త సేకరణకు ట్రాక్టరు కొనుగోలుకు ఎందుకు టెండర్లు పిలవడం లేదని సంబంధిత అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 7వవార్డు చప్పిడివారిపాలెంలో రూ.30లక్షలతో నిర్మించే రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కౌన్సిలర్ శ్రీనివాస్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. 13వవార్డులో రెండు నెలలుగా వీధి లైట్లు వెలగడంలేదని, శానిటేషన్ లేక ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని, ప్రజలకు ముఖం చూపించలేని పరిస్థితిలో ఉన్నామని కౌన్సిలర్ జయలక్ష్మి ఆవేదన వ్యక్తంచేశారు. అమృత 2.0పథకం ద్వారా మంజూరయ్యే రూ.14.50కోట్లకు నగరపంచాయతీ సాధారణ నిధుల నుంచి రూ.2.70కోట్లు చెల్లించే విధంగా ఉన్న నోట్‌ను మార్చాలనిసమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. నగరపంచాయతీ మేనేజర్ పీవీ నూకరాజు, ఏఈ పీవీ సుధాకర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కొవిడ్ ముంచుకొస్తుంది.. పారిశుధ్యం అధ్వానం

● ఇంజనీరింగ్ అధికారుల పనితీరుపై.. అధికార విపక్ష కౌన్సిలర్ల ధ్వజం



చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి సమక్షంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అధికార విపక్ష కౌన్సిలర్లు

అమలాపురం టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): చాపకింద నీరులా కొవిడ్ ముంచుకొస్తుంది.. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది.. రోగాలు పెరిగే ప్రమాదం ఉంది.. పారిశుధ్య కార్మికులపై బలమైన ఇన్‌ఫ్లూయన్స్ పనిచేస్తుంది.. పనిచేయని పారిశుధ్య కార్మికులను తక్షణం విధుల నుంచి తొలగించి అవసరమైతే కొత్తవారిని నియమించాలని అధికార, విపక్ష కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. కొందరు కార్మికులు అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద పనులకే పరిమితం అవుతున్న అంశంపై చర్చించారు. పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపినా కేవలం రెండు పనుల టెండర్లను మాత్రమే ఖరారుచేయాలని కోరుతూ ఇంజనీరింగ్ అధికారులు ఎజెండా అంశంగా తీసుకురావడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఎజెండా అంశాలు ప్రారంభం కాకుండానే 4వ వార్డు కౌన్సిలర్ పడాల శ్రీదేవి మాట్లాడుతూ పైపులైన్లు పగిలిపోయి మురుగునీరు సరఫరా అయిందని, దాంతో రెండు రోజులు వార్డు ప్రజలు మురుగునీరు తాగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని అధికారులకు సూచించినా పట్టించుకోని వైనంపై ఆమె మండిపడ్డారు. పైపులైను పగిలిపోయినప్పుడు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని తెలియదా అని అధికారపక్ష కౌన్సిలర్ సంసాని బులినాని అధికారులను ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కౌన్సిలర్ల ఇళ్లల్లోనే మంచినీరు లేని పరిస్థితి ఏర్పడిందని, తాగునీటి సరఫరాలో జరుగుతున్న అస్తవ్యస్త విధానాలపై కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. పట్టణంలో ఎన్నో అభివృద్ధి పనుల కోసం తీర్మానాలు చేసి నెలలు గడిచిపోయినా ఇంత వరకు ఆ పనులను ఎందుకు ఎజెండా అంశాలకు తీసుకురాలేదని కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, గండి దేవిహారిక ప్రశ్నించారు. అధికారులు లేనప్పుడు సమావేశం పెట్టడం ఎందుకని ప్రశ్నించారు. ఎజెండా అంశాలకు సంబంధించిన సమాచారం కూడా మీ వద్ద లేదా అని ఇన్‌చార్జి కమిషనర్ రాణిసంయుక్తను ప్రశ్నించారు. ఏఈ, డీఈలు లేకపోతే ఇక ఎవరూ సమాధానం చెబుతారని బులినాని నిలదీశారు. మున్సిపల్ డీఈ చెప్పినందువల్లే టెండర్లు ఆమోదానికి ఎజెండాలోకి తీసుకువచ్చినట్టు గుమస్తా చెప్పడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. ఆమోదం పొందిన కోట్లాది రూపాయల పనులను నాలుగు నెలలుగా టెక్నికల్ శాంక్షన్‌కు పంపించని వైనంపై అధికారుల తీరును బులినాని నిలదీశారు. సంబంధిత అధికారులు బదిలీ అయినప్పటికీ వారిని రిలీవ్ చేయవద్దని కౌన్సిలర్ నాగేంద్ర సూచించారు. ఒక పిల్లాడు గోతిలో పడిపోయిన వైనాన్ని అధికారులు పట్టించుకోకపోతే ఎలా అని కౌన్సిలర్ యేడిద శ్రీను మండిపడ్డారు. పార్కులో డ్రైన్‌పై బల్లలు వేయించలేదా అని చైర్‌పర్సన్ ప్రశ్నించారు. కనిపించకుండా పోతున్న పారిశుధ్య కార్మికులతో వార్డుల్లో అపారిశుధ్యం తాండవిస్తుందని కౌన్సిలర్లు పెండి అమరావతి, చిత్రపు రామకృష్ణ, కొల్లాటి దుర్గాబాయి తదితరులు నిలదీశారు. ఎనిమిది నెలలుగా వార్డుల్లోని పారిశుధ్య పరిస్థితుల గురించి వివరిస్తున్నా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని, సగం మంది కార్మికులు కూడా పట్టణంలో పనిచేయడంలేదని సభ్యులు ధ్వజమెత్తారు. విధులకు హాజరు కాని పారిశుధ్య కార్మికులను తొలగించాలని అధికార విపక్ష కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. మేస్త్రీలు, వర్కర్లను జంబ్లింగ్ విధానంలో మార్పు చేస్తేనే పారిశుధ్య పరిస్థితి మెరుగుపడుతుందని శానిటేషన్ సిబ్బంది పేర్కొన్నారు. పట్టణంలో 285షాపుల ట్రేడ్ లైసెన్సులను తొలగించిన అంశంపై తీవ్రస్థాయిలో చర్చ నిర్వహించారు. తొలగించిన షాపుల స్థానే కొత్తగా షాపులు ఏర్పాటుచేస్తే ట్రేడ్ లైసెన్సులు ఎందుకు ఇవ్వడం లేదని కౌన్సిలర్ రాజేష్ ప్రశ్నించారు. ట్రేడ్ లైసెన్సుల వ్యవహారంపై ర్యాండంగా చెక్ చేస్తామని హెచ్చరించారు.

సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలన



సీహెచ్ గున్నేపల్లిలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు

ముమ్మిడివరం, మే 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాలో ఈనెల31న పర్యటించనున్నందున కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు పలు ప్రాంతాలను పరిశీలించి ఏర్పాట్లపై సమీక్షించారు. మంగళవారం రాత్రి ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలో హెలిప్యాడ్ స్థలాన్ని, కాట్రేనికోన మండలం చెయ్యేరులో సభాప్రాంగణ స్థలాన్ని ఎస్పీ బి.కృష్ణారావు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. పర్యటనకు సంబంధించి భద్రత, రవాణా, పారిశుధ్యం, వేదిక ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

కాట్రేనికోన, మే 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై చెయ్యేరులో మంగళవారం అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్షించారు. చెయ్యేరులో సభాస్థల ప్రాంగణాన్ని ఎస్పీ బి.కృష్ణారావు పరిశీలించారు. భద్రత, రవాణా, పారిశుధ్యం, వేదిక ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. సీఎం పర్యటన విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచెయ్యాలన్నారు. బాధ్యతలను పంచుకుని సమయానుకూలంగా ఏర్పాట్లు చెయ్యాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అసౌకర్యం కల్గకుండా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవం

అంతర్వేది, మే 27(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, భక్తులు, స్థానికులు, సిబ్బంది, అర్చక స్వాములు మంగళవారం యోగా గురువుల ఆధ్వర్యంలో ఆసనాలు వేశారు. ప్రతి భక్తుడు ఆధ్యాత్మిక భావనతో పాటు యోగాతత్వాన్ని అలవర్చుకుని పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ అన్నారు. జూన్ 3న యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

చోరీకి విఫలయత్నం

ముమ్మిడివరం, మే 27(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం టీటీఆర్‌నగర్‌లో చోరీకి విఫలయత్నం చేశారు. టీటీఆర్‌నగర్‌కు చెందిన చింతలపూడి బాబు కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లారు. ఆ ఇంట్లోకి దొంగలు ప్రవేశించి చోరీకి విఫలయత్నం చేశారు. తలుపునకు ఉన్న పది లాక్ తాళాలు ఎంత ప్రయత్నించినా తెరుచుకోకపోవడంతో తలుపులు తెరిచేందుకు తీసుకువచ్చిన సామగ్రిని అక్కడే వదిలి పరారయ్యారు. స్థానికులు ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు యానాం ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

యానాం, మే 27(ఆంధ్రజ్యోతి): యానాం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో బుధవారం ఉదయం 10గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణాసుధాకర్ తెలిపారు. తమిళనాడు కాంచీపురంలోని ఎల్అండ్‌టీ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాకు పిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్, సివిల్, వెల్డర్, మోటార్ మెకానిక్ ట్రేడ్స్ అభ్యర్థులు హాజరు కావాలన్నారు. యానాం రీజియన్‌కు చెందిన ఐటీఐ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, శిక్షణ పూర్తిచేసుకున్న నిరుద్యోగులు అర్హులన్నారు. వివరాలకు 9849010936 నంబరును సంప్రదించాలన్నారు.

ఉపాధి బకాయిలు విడుదల చేయాలి

అమలాపురం రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ వేతన బకాయిలను తక్షణం విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పి.శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరు వారాలుగా ఉపాధి కూలీలు చేసిన పనులకు ఒక్కరోజు వేతనం కూడా చెల్లించలేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధుల బృందం మంగళవారం తాండవపల్లి గ్రామంలో పర్యటించి ఉపాధి కూలీలతో చర్చించారు. ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి ముందు ఏకరువు పెట్టారు. కూలీల పనిదినాలు 200రోజులకు పెంచాలని, రోజువారీ కూలీ రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు జి.దైవకృప, పి.అమూల్య, మట్టా శాంతికుమారి, గుత్తుల దుర్గ, యిళ్ల లక్ష్మి పాల్గొన్నారు.

ఏఎఫ్‌డీటీ ట్రస్టు ఆరోపణలపై విచారణ

మలికిపురం, మే 27(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఏఎఫ్‌డీటీ ట్రస్టుపై రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్టు ఆర్జేడీ వీవీ కృష్ణాజీ తెలిపారు. మలికిపురం ఏఎఫ్‌డీటీ డిగ్రీ కళాశాలలో విచారణకు వచ్చిన ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఏఎఫ్‌డీటీ ట్రస్టులో నిధులు దుర్వినియోగం తదితర సమస్యలపై ఫిర్యాదు రాగా దానిపై విచారణ చేస్తున్నామన్నారు. కొందరు అధ్యాపకులను వర్కులోడు పేరుతో తొలగించిన దానిపై వారి నుంచి వివరాలు తీసుకుని తగు చర్యలు తీసుకుంటామన్నారు. డిగ్రీ విద్యా విధానంలో మార్పులు తీసుకువస్తున్నారని, గతంలో సింగిల్ మేజర్ వ్యవస్థ ఉండగా సెకండ్ మేజర్ వ్యవస్థగా మార్పు రానుందని చెప్పారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు





పి.గన్నవరం నుంచి బయలుదేరిన టీడీపీ శ్రేణులు. మామిడికుదురు: మహానాడులో టీడీపీ నాయకులు

పి.గన్నవరం, మే 27(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడుకు పి.గన్నవరం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు బస్సుల్లో తరలి వెళ్లారు. ఇప్పటికే పలువురు నేతలు కడప చేరుకున్నారు. మంగళవారం మరికొంత మంది బయలుదేరి వెళ్లారు. సమీప గ్రామాల టీడీపీ శ్రేణులు పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి చేరుకుని అక్కడ నుంచి బస్సులో బయలుదేరారు. తరలి వెళ్లిన వారిలో సంసాని పెద్దిరాజు, అంబటి కోటేశ్వరరావు, గుడాల వెంకటరమణ, గుడాల సంపదరావు, బోరుసు సత్యనారాయణ, పల్లి రామ్మూర్తి, పెచ్చెట్టి ఈశ్వర్, చప్పిడి నాగబాబు, లంకే చిరంజీవి, కామాడి రామకృష్ణ, చీకట్ల రామకృష్ణ, యండ్ర దొరబాబు, అంచూరి రమేష్, బీర వెంకటేశ్వరరావు, చెల్లిబోయిన వెంకటేశ్వరరావు ఉన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ తెలుగుదేశం ప్రముఖులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మొట్టమొదటిసారిగా కడప గడ్డపై నిర్వహించిన తొలిరోజు మహానాడు విజయవంతంగా జరిగిందన్నారు. సభాస్థలిలో ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం భోజనాలు చక్కగా ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి పాల్గొన్నట్టు చెప్పారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): కడపలో జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో మండలానికి చెందిన నాయకులు హాజరయ్యారు. మండలం నుంచి జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, ఈలి శ్రీనివాసరావు, సాపే ఏకాదశి, ముకరం హుస్సేన్, ఉండ్రు శ్రీరామారావుతో పాటు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు మహానాడులో పాల్గొన్నారు.

మాతా రమాబాయి వర్ధంతి

అమలాపురం టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): కొంకాపల్లిలో దళితసేన ఆధ్వర్యంలో మాతా రమాబాయి వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాకపల్లి హరీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాతారమాబాయి, అంబేడ్కర్ చిత్రపటాలకు దళితసేన అధ్యక్షుడు డేవిడ్ అంబేడ్కర్ పూలమాలలువేసి నివాళులర్పించారు. రమాబాయి సేవలను వక్తలు కొనియాడారు. సాపే శ్రీరామ్, గోసంగి జాకబ్, కమిడి శామ్యూల్ పాల్గొన్నారు.

పలువురు నేతల పరామర్శ..

ముమ్మిడివరం, మే 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రామచంద్రపురం వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను ఆరా తీశారు. గోదావరిలో స్నానానికిదిగి ఎనిమిది మంది యువకులు మృత్యువాత పడడంతో వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని, బాధిత కుటుంబాలను తక్షణం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు శిక్షణ ఇవ్వడంతో పాటు పంచాయతీ వద్ద లైఫ్ జాకెట్లు ఉంటే కొంతవరకు ప్రాణనష్టం తగ్గించవచ్చన్నారు. టీడీపీ నాయకుడు కాకర్లపూడి రాజేష్ సంఘటనా స్థలంలో ఉంటూ గల్లంతైనవారి గాలింపు చర్యలను పర్యవేక్షిస్తూ అక్కడున్న బృందాలకు సహకారాలు అందించారు.

డ్రైవర్‌కు సన్మానం

అమలాపురం రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): అమలాపురం-భద్రాచలం సర్వీసుకు రెండు పర్యాయాలు అత్యధిక ఆదాయం తెచ్చినందుకు డిపో డ్రైవర్ ఎస్కేజీ మొహిద్దీన్‌ను జిల్లా ప్రజారవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ సత్కరించారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రతిమకుమారి, నాగరాజు, వరహాలబాలు, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్లు, డిపో సిబ్బంది పాల్గొని మొహిద్దీన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

యోగా భారతీయ వారసత్వ సంపద : కలెక్టర్



కలెక్టరేట్ నుంచి మాస్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మే 27(ఆంధ్రజ్యోతి): యోగా భారతీయ వారసత్వ సంపద అని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. మెరుగైన జీవనానికి మానసిక, శారీరక ప్రశాంతతకు యోగా ఉపకరిస్తుందన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు జిల్లాస్థాయి అధికారులు, డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలతో చేపట్టిన యోగా దినోత్సవ మాస్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. యోగాను ప్రతీ ఒక్కరూ దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. జేసీ టి.నిషాంతి, డీఆర్వో రాజకుమారి, యోగా గురువులు అమర్, కిశోర్, భాస్కర్, కృష్ణవేణి, మణికంఠ, రమేష్, డీఈవో షేక్ సలీంబాషా, సాంఘికసంక్షేమశాఖ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఎల్డీఎం కేశవవర్మ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

అయినవిల్లి, మే 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కొండుకుదురు జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్ఎం వి.శ్రీహరి కోరారు. మంగళవారం జడ్పీ హైస్కూలు ఆధ్వర్యంలో 6నుంచి పదో తరగతి విద్యార్థులను పాఠశాలల్లో చేర్చుకునేందుకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఆటో ద్వారా ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. విద్యా కమిటీ చైర్మన్ పి.విశ్వేశ్వరరావు, యాళ్ల ఆనందరావు, కోలా అర్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

అంబాజీపేట, మే27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను రైతులకు పూర్తిస్థాయిలో అందించి సహకార సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని డివిజనల్ సహకార శాఖాధికారి ఏ.రాధాకృష్ణారావు అన్నారు. అంబాజీపేట సహకార సంఘ కార్యాలయంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 సందర్భంగా మేనేజింగ్ కమిటీ సభ్యులకు సామర్థ్య నిర్మాణం- సుపరిపాలన అంశంపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. రాధాకృష్ణారావు మాట్లాడుతూ రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఉద్యోగులు పనిచేయాలన్నారు. డివిజనల్ సహకార ఆడిటర్ డి.విజయలక్ష్మి, జిల్లా సహకార శిక్షణ ఇన్‌చార్జ్ ఆదిమూలం వెంకటేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వరరావు, సహకార సంఘం ఇన్‌చార్జ్ ఐ.శ్రీనివాస్, సీఈవో కుంపట్ల అయ్యప్పనాయుడు పాల్గొన్నారు.

డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట, మే 27(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీబీడీసీపీ సబ్‌యూనిట్ అధికారి ఎన్వీ రామారావు అన్నారు. ఇసుకపూడిలో డెంగ్యూ వ్యాధి లక్షణాలు, దోమల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సీహెచ్‌వో బి.అప్పారావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నివాస ప్రాంతాల మధ్య నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం అంబాజీపేట పీహెచ్‌సీలో రికార్డులను, ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు బహూకరణ

ఉప్పలగుప్తం, మే 27(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం పంచాయతీలో శివారు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను గమనించిన స్థానికులు చిక్కం దానియేలు, ఇస్సాకు తమ తండ్రి సాంబమూర్తి జ్ఞాపకార్థం వాటర్ ట్యాంకును బహూకరించారు. మంగళవారం తహశీల్దార్ వాసా వీఎస్ దివాకర్ ట్యాంకును పంచాయతీకి అందించారు. తాగునీటి ఎద్దడి ప్రాంతాలకు ఈ ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అవకాశం కలిగిందని సర్పంచ్ కడిమి చిన్నవరాజు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీడీవో పీఆర్సీ రాజ్‌కుమార్, చిక్కం ఉమేష్, రవణం మధు, సలాది సతీష్, ఆకుల రామకృష్ణ, చిక్కం భీముడు, నాగులపల్లి రాజు, చిక్కం కాను, గాలిదేవర సురేష్, చిక్కం సూర్యమోహన్, చిక్కం వెంకటకృష్ణ, పంచాయతీ కార్యదర్శి తిక్కిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, మే 27(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ, 11కేవీ లైన్స్ మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, చీకట్లపాలెం, పేరాయిచెరువు, వాడపర్రు, కూనవరం, కిత్తనచెరువు, సన్నవిల్లి, మునిపల్లి, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, ఎన్.కొత్తపల్లి, రాఘవులపేట, సూదాపాలెం, భట్నపాలెం, నంగవరం, భీమనపల్లి, సింగరాయపాలెం, విలసవిల్లి గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.

అధిక దిగుబడి సాధించవచ్చు

అమలాపురం టౌన్, మే 27(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులు సురక్షితమైన పద్ధతులతో అధిగ దిగుబడిని సాధించవచ్చునని ఇండియా కన్సల్టెంట్ లక్కరాజు సత్యనారాయణ పేర్కొన్నారు. ఆక్వారైతులకు గ్రంప్ ఇంప్రూవ్‌మెంట్ సిస్టమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మేలైన పద్ధతుల్లో ఆక్వాసాగు చేపట్టే విధానాలను ఎస్ఐఎస్ కంపెనీ ప్రతినిధులు వివరించారు. సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆక్వాకల్చర్ యాజమాన్య పద్ధతులను వివరించారు. సేల్స్ హెడ్ శివప్రసాద్, టెక్నికల్ హెడ్ నానంగ్, డేటా ఎనలిస్ట్ డాక్టర్ రుషి, శివప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా తాటమ్మతల్లి తీర్థం

పి.గన్నవరం, మే27(ఆంధ్రజ్యోతి):పి.గన్నవరం గ్రామదేవత శ్రీతాటమ్మతల్లి తీర్థమహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. కొన్ని రోజులుగా గ్రామస్తులు అమ్మవారికి సేవలు, జాగర మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, ఆడపడుచులు నైవేద్యాలు సమర్పించారు. సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ కమిటీ సభ్యులు క్యూలైన్లు ఏర్పాటు చేసి అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. తొలుత అమ్మవారి ఘటాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తుల నుంచి నైవేద్యాలు స్వీకరించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పాడిరైతులకు పశుదాణా పంపిణీ


పి.గన్నవరం, మే 27 (ఆంధ్రజ్యోతి): మానేపల్లిలో మండల పశువైద్యా.ధికారి డాక్టర్ కిరణ్‌చైతన్య, స్థానిక సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి మంగళ వారం పాడి రైతులకు సబ్సిడీతో పశుదాణా అందజేశారు. అనంతరం పశువులకు వ్యాపించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి మైథిలి, ఏహెచ్ఏ ఎన్.రాజా, పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

ఉచిత యోగా తరగతులు

ఐ.పోలవరం, మే 27(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర క్యాంపెయిన్- 2025 కార్యక్రమంలో భాగంగా ఈనెల27 నుంచి జూన్ 21వరకు ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్టు మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. నెల రోజులు జరిగే కార్యక్రమంలో సిబ్బంది, అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. ఈసందర్భంగా ఆలయం వద్ద ఉచిత ప్రసాద వితరణకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నగరం ఏఎంసీ పాలకవర్గ నియామకం

చైర్‌పర్సన్‌గా పెనుమాల లక్ష్మి



మామిడికుదురు, మే 27(ఆంధ్రజ్యోతి): నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీని నియమిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను గౌరవ చైర్మన్‌గా, మొగలకుదురు గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకురాలు పెనుమాల లక్ష్మిని చైర్‌పర్సన్‌గా, 20మంది సభ్యులతో కమిటీని నియమించారు. మొండెపులంకకు చెందిన గుడాల వెంకటరమణను వైస్‌చైర్మన్‌గా, బండారు శ్రీను, బొక్కా లలితాదేవి, కండిపోటి సత్యఈశ్వరి, కుంపట్ల మల్లిఖార్జునరావు, లంకే వెంకటలక్ష్మి, లూటుకుర్తి సత్యనారాయణ, నిమ్మకాల వెంకటలక్ష్మి, నూకల వెంకటేశ్వరరావు, పెంటా ఏసుకుమారి, పినిశెట్టి రామచంద్రశేఖర్, అడబాల నాగమణి, చిట్టాల రామజోగేశ్వరరావు, పితాని వెంకటేశ్వరరావుతో పాటు నగరం సర్పంచ్ జాలెం రమణకుమారి, మరో ముగ్గురు అధికారులను సభ్యులుగా నియమించారు.

పీహెచ్‌సీ నిర్మాణ పనులు చేపట్టాలి

అంతర్వేది, మే 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రూ.1.50కోట్లతో సఖినేటిపల్లిలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణం 60శాతం పనులు చేసి మధ్యలో నిలిపివేశారని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు మంగళవారం బీజేపీ నాయకులు వినతి పత్రాన్ని అందించారు. పూర్తిస్థాయిలో భవన నిర్మాణం చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రస్తుతం తాత్కాలికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారని, రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, జనసేన నాయకులు దిరిసాల బాలాజీ, గంటా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభం

యానాం, మే 27(ఆంధ్రజ్యోతి): యానాంలో ఎంకేఆర్ ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వాహకులు ప్రారంభించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 62వ పుట్టినరోజును పురస్కరించుకుని అభిమాన సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈటోర్నమెంట్‌లో 18జట్లు పాల్గొన్నాయి. మల్లాడి అభిమాన సంఘం నాయకులు పెండెం సూర్యప్రకాష్, మల్లాడి శామ్యూల్, గుత్తుల గోవిందజయరామారావు, గూటం శివగణేష్‌లు పోటీలను ప్రారంభించారు. స్థానిక మెట్టకుర్రు ప్రభుత్వ పాఠశాలలో పోటీలు జరుగుతున్నాయి. ప్రథమ బహుమతి 30వేలు, ద్వితీయ రూ.20వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు బహుమతి జూన్ 6న జరిగే మల్లాడి పుట్టినరోజు వేడుకల్లో అందజేస్తామన్నారు. నిర్వాహకులు పంతగడ రమేష్ నాయుడు, దుర్గబాబు, సుమాన్, దయ, నాగూర్, చింత అజయ్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.73 లక్షలు

ఆత్రేయపురం, మే 27(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. నోము ఆచరించిన అష్టోత్తర భక్తజనం ప్రత్యేక పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదంలో భక్తులు పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,73,737 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో ఎన్.సూర్యచక్రధరరావు తెలిపారు



ద్వారపూడిలో సిందూర్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న కూటమిశ్రేణులు, విద్యార్థులు

ద్వారపూడిలో సిందూర్ ర్యాలీ

మండపేట, మే 27(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన నేపథ్యంలో మంగళవారం ద్వారపూడిలో విజయోత్సవ తిరంగా యాత్రను నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థినులు, కూటమినేతలు పాల్గొన్న ర్యాలీ ద్వారపూడి గ్రామమంతా సాగింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో కూటమినేతలతో పాటు పాఠశాల హెచ్ఎం విజయ, కూటమినేతలు కె.మురళీకృష్ణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ, ఉపాధ్యాయురాలు భ్రమరాంబ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు సత్తి సత్యనారాయణ, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు చింతా దొరబాబు, పలువురు నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.



కేదార్లంక ర్యాంపు వద్ద విచ్చలవిడిగా జరిపిన తవ్వకాలు (ఫైల్‌ఫొటో)

గోదావరి నదిలో స్నానానికి దిగి..

ప్రాణాలు కోల్పోతున్న యువత

• కేదార్లంక వద్ద వరుస ఘటనలు • పట్టించుకోని అధికారులు

కపిలేశ్వరపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కేదార్లంక నదిలో యువత స్నానానికి దిగి మృత్యువాతపడ్డారు. ఆ ప్రాంతంలో వరుస ఘటనలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గతనెల 5న కేదార్లంకలో స్నానానికి దిగి కొత్తపేటకు చెందిన రొట్టా దుర్గాప్రసాద్(21) మృత్యువాతపడ్డాడు. ఈనెల 6న మండపేటకు చెందిన యువకులు ధనమ్మ అమ్మవారి మొక్కు చెల్లించి తిరుగు ప్రయాణంలో వెళుతూ దాసరి సాయిరాం(27), మొండెం రాంబాబు(35) వీధివారిలంక దగ్గర గోదావరి నదిలో స్నానానికి దిగి మృత్యువాతపడ్డారు. కేదార్లంకలో ఇసుక ర్యాంపులో విచ్చలవిడి తవ్వకాల వల్ల దుర్గాప్రసాద్ మృతి చెందాడని ఆరోపిస్తూ మృతదేహంతో ధర్నా జరిపారు. గోదావరిని ఆనుకుని విచ్చలవిడిగా మట్టి, ఇసుక తవ్వకాలు అక్రమంగా జరపడం వల్ల ఏ ప్రాంతంలో లోతు ఉందో తెలియక యువత మృత్యువాత పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి దీనికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాణింగపల్లిలో ఎన్టీఆర్‌కు ఘన నివాళి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కె.గంగవరం, మే 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని పాణింగపల్లి గ్రామంలో ఆ పార్టీ నాయకులు ముందస్తుగా మంగళవారం నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి వారు నివాళలర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు బలుసు నాగేంద్ర మాట్లాడారు. బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. దివంగత ఎన్టీఆర్ జాతికి చేసిన సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరి సేవలు చిరస్మరణీయం

మండపేట, మే 27(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో కందుకూరి వీరేశలింగం వర్ధంతిని జరిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కందుకూరి సేవలు నేటి తరాలకు ఆదర్శమని పలువురు వక్తలన్నారు. ఆయన కృషి మరువలేనిదని విద్యా కమిటీ ఛైర్మన్ కె.మురళీకృష్ణ అన్నారు. అనంతరం కందుకూరి చిత్రపటానికి విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కూటమి నేతలు, కె.సత్యనారాయణ, సత్తి సత్యనారాయణ, చింతా దొరబాబు, పల్లా సన్యాసిరావు, డాక్టర్ నాయుడు, హెచ్ఎం విజయ, ఎన్‌సీసీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కడపలో ఆంజనేయస్వామికి ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు

మండపేట, మే 27(ఆంధ్రజ్యోతి): కడపలో జరిగే టీడీపీ మహానాడుకు వెళ్లిన మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం అనుచరులతో కలిసి కడప జిల్లాలోని గండిలో ఉన్న అంజనేయస్వామిని మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నేతలు నల్లమిల్లి వీర్రెడ్డి, యరగతపు బాబ్జి, ముత్యాల వెంకట్రావు, చింతపల్లి రామకృష్ణ, పిల్లా తాతీలు, పెనుమత్స వెంకటరాజువర్మ, కాదా ప్రభాకరరావు, కర్రి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మండపేట, మే, 27(ఆంధ్రజ్యోతి): మండపేటలోనున్న భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకుడు ఖండవల్లి పవన్‌కుమార్ సారథ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు అన్న సమారాధన చేశారు.

స్వామివారికి ప్రముఖుల పూజలు: కరాచీ సెంటరులో వున్న ఆంజనేయస్వామిని టీడీపీ నేతలు మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మల్లిపూడి గణేష్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

• వైసీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు, మే 27(ఆంధ్రజ్యోతి): చొప్పెల్ల గ్రామదేవత కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. ఇటీవల కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని దాతల సహకారంతో పునర్నిర్మించారు. ఈనెల 31న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు, పూజలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కపిలేశ్వరపురం, మే 27 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ డి.తారక్‌వంశీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి డి.శివకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం





ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో మండపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు తదితరులు

ఆత్రేయపురం, మే 27(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం పదిలమని పలువురు వక్తలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగా అభ్యాసకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో వెంకటరామన్, పీఈటీలు పి.శ్రీనివాస్, పి.శోభారాణి ఆధ్వర్యంలో యోగా అభ్యాసకులకు శిక్షణ నిర్వహించారు. అనంతరం యోగాసనాలు వేశారు. డిప్యూటీ ఎంపీడీవో యు.చంద్రశేఖర్, పరిపాలన అధికారి రామస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట, (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని మండపేట మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణమూర్తి, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని మంగళవారం మండపేట మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయం వద్ద యోగాడేను నిర్వహించారు. అనంతరం యోగా డే విశిష్టత తెలుపుతూ ర్యాలీ జరిపారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై యోగా గురువులు తెలిపారు. అనంతరం పలు రకాల ఆసనాలు వేశారు. కార్యక్రమంలో మండపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, మున్సిపల్ సిబ్బందితోపాటు, మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, మండల డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీను, పంచాయతీ కార్యదర్శులు పి.శ్రీనివాస్, మండల పరిషత్ పరిపాలన అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రాయవరంలో యోగాపై ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

యోగాతో ఒత్తిడికి చెక్

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): యోగాతో ఒత్తిడికి చెక్ పెట్టవచ్చునని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులకు యోగాపై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీవో రాజు, ఎంఈవో బి.అప్పాజీ, మండల పరిషత్ ఏవో మోహర్‌ప్రకాష్, యోగా శిక్షకుడు సత్తిబాబు యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. వచ్చేనెల 24న జరిగే యోగా డే వరకు జరిగే తరగతులకు క్రమం తప్పకుండా అందరూ హాజరు కావాలని సూచించారు.

యోగాంధ్రపై ఉద్యోగులకు శిక్షణ

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం యోగాంధ్రపై ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఈనెల 27 నుంచి 30 వరకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి యోగాపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం, (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ యోగా, ధ్యానం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వలంటరీ బ్లడ్ డోనర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు, యోగా గురువు వెలగల పణికృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం రాయవరం సత్యసాయి ధ్యాన మందిరంలో ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యానికి యోగా, ధ్యానం చేయాలన్నారు. అనంతరం యోగా, ధ్యానంపై గ్రామస్తులకు శిక్షణ ఇవ్వడంతో పాటు అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో గజ్జరపు కాశీ విశ్వనాథం, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలమూరులో యోగా శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజు



మండపేటలో యోగా ర్యాలీలో పాల్గొన్న కమిషనర్, చైర్‌పర్సన్, ఉద్యోగులు



పినపళ్ల గ్రామదేవత గొల్లాలమ్మ అమ్మవారు

ఘనంగా గ్రామదేవతల ఉత్సవాలు

ఆలమూరు, మే 27(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పినపళ్ల, పెనికేరు గ్రామదేవతల జాతరతో పాటు, తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. పినపళ్ల గ్రామదేవత గొల్లాలమ్మ, పెనికేరు గ్రామదేవత పోలేరమ్మ అమ్మవార్ల జాతరను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతరలో గరగ నృత్యాలతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం అమ్మవార్ల తీర్థమహోత్సవాలు జరిగాయి. ఆయా గ్రామాల భక్తులతోపాటు సమీప గ్రామాల భక్తులు విచ్చేసి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఉత్సవ కమిటీల అధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.



రాయవరంలో పుస్తకాలు, బ్యాగ్‌ల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో

స్టాక్ పాయింట్ పరిశీలన

రాయవరం, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 2025-26 సంవత్సరానికి అందజేసే పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఎంఈవో-2 వై.సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌ల స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 3,156 పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయని, 2,912 బ్యాగ్‌లు వచ్చినట్లు తెలిపారు. స్టాక్ పాయింట్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



పినపళ్ల సర్పంచ్ సుభాష్‌ను సత్కరిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

అవార్డు గ్రహీతకు సత్కారం

ఆలమూరు, మే 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉత్తమ పంచాయతీల కేటగిరిలో అవార్డు స్వీకరించిన పినపళ్ల సర్పంచ్ సంగిత సుభాష్‌ను పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు సత్కరించారు. రాష్ట్రస్థాయ అవార్డు స్వీకరించిన సుభాష్‌ను అభినందిస్తూ పినపళ్ల పశువైద్యాధికారి ఈదల శ్రీనివాస్‌తోపాటు పలువురు ఉద్యోగులు మంగళవారం సత్కరించారు. పినపళ్లకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు.

జీతాలు ఇప్పించరూ..

టెక్నికల్ అసిస్టెంట్ల వినతి

ఆత్రేయపురం, మే 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో టెక్నికల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు విడుదల కాక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. సుమారు పదేళ్ల క్రితం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో మండలస్థాయి జేఈల వద్ద టెక్నికల్ అసిస్టెంట్లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. నెలకు రూ.18,800 జీతం ఇస్తున్నారు. 2017లో వీరందరినీ ఎన్ఆర్ఈజీఎస్‌కి బదలాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 504 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 60, కోనసీమ జిల్లాలో 15 మంది పనిచేస్తున్నారు. పదిహేడు నెలల నుంచి ప్రభుత్వం జీతాలు విడుదల చేయకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనరు కృష్ణ చైతన్యను ఇటీవల కలిసి జీతాల బకాయిలు విడుదల చేయాలని యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందచేశారు. ఉమ్మడి జిల్లాలోని కలెక్టర్ కార్యాలయం వద్ద తమకు జీతాలు అందించాలని ఇటీవల విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం జీతాల బకాయిలు విడుదల చేయాలని వారు మొరపెట్టుకుంటున్నారు.



కడప మహానాడులో ఎమ్మెల్యే బండారును కలిసిన నియోజకవర్గ శ్రేణులు

కడప మహానాడులో టీడీపీ శ్రేణుల సందడి


కొత్తపేట, మే 27(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడుకు కొత్తపేట నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు తరలివెళ్లిన సంగతి తెలిసిందే. తొలిరోజు పసుపు పండుగలో పాల్గొనే ముందు వారిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కలుసుకున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహానాడులో తీసుకోవాల్సిన చర్యలపై వారికి తెలియచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధరణాల రామకృష్ణ, సలాది నాగేశ్వరరావు, బూసి భాస్కరరావు, కుడుపూడి పట్టాభిరామయ్య, ముద్రగడ ఫణి, వాసంశెట్టి సత్యనారాయణ, పాలంగి ఆశీర్వాదం, గంధం లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై బాలికలకు అవగాహన



పసలపూడిలో కిశోరి బాలికలతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, మే 27(ఆంధ్రజ్యోతి): పసలపూడి గ్రామంలో వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కిశోరి బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు కిశోరి బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో కిశోరి బాలికలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్లు, ఆశ కార్యకర్తలు, కిశోరి బాలికలు తదితరులు పాల్గొన్నారు.



చేతికి అందుతున్న ఫీజ్ కారియర్

ప్రమాదభరితంగా ఫీజ్ బాక్సులు

రావులపాలెం, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వీధి దీపాల కోసం ఏర్పాటు చేసే ఫీజ్ కారియర్లు, ఇతర విద్యుత్ వినియోగం కోసం అమర్చిన ఫీజులు చేతికి అందే ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ప్రమాదం వస్తుందోనని హడలిపోతున్నారు. రావులపాలెం మండల పరిధిలోని గ్రామాల్లో రహదారుల చెంతనే ఉన్న విద్యుత్ స్తంభాలకు ఫీజ్ కారియర్లు ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఫీజ్ కారియర్లు అమర్చే విధంగా ఉన్నప్పటికి చాలా ప్రాంతాల్లో విద్యుత్ వైర్లనే ఫీజ్ కారియర్‌లుగా వినియోగిస్తుండటంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అధికారులు స్పందించి వాటికి రక్షణ బాక్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

జాబ్‌మేళాలో 42 మంది ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 27 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో మంత్రి సుభాష్ నిర్వహిస్తున్న ఉపాధి కార్యాలయంలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాలో 42 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో డబ్ల్యుఎన్ఎస్‌లో 11 మంది, కాన్సెప్ట్రిక్స్ 6, పోస్కాన్ 12, విస్ట్రోన్ 9, సైండ్లర్ 4 మంది ఎంపికయ్యారు. వీరికి కంపెనీల ప్రతినిధులు పరశురామ్, మహేష్ లు నియామక పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధి ప్రాజెక్టు డైరెక్టరు రామ్‌కుమార్, సీఈవో అనిల్ ఉండు, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్లలో రాగివైర్ల చోరీ రైతుల ఫిర్యాదు

ఆత్రేయపురం, మే 27(ఆంధ్రజ్యోతి): కరెంట్ మోటార్లలోని రాగివైర్లను దొంగిలించే ముఠాపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆత్రేయపురం, అంకంపాలెం, ర్యాలి, లొల్ల, తాడిపూడి, మెర్లపాలెం తదితర గ్రామాల్లో సుమారు 150 కరెంట్ మోటార్లలోని రాగివైర్లు చోరీకి గురయ్యాయి. సోమవారం రాత్రి గుర్తు లొల్ల నుంచి ఆత్రేయపురం వెళ్లే మార్గంలో విద్యుత్ మోటార్‌లోని రాగివైర్లను దొంగిలించుకుపోయారని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 15 మందిపై కేసు

మద్యం సేవించి వాహనం నడుపుతున్న 15 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. కొద్దిరోజుల నుంచి ఆయా ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా బ్రీతింగ్ ఎనలైజర్ టెస్టింగ్‌లు నిర్వహించినట్టు తెలిపారు. ఈ పరీక్షల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 15 మంది పై కేసు నమోదు చేసి వారిని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.